ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 23.0









కార్తీక శోభ

కార్తీక మాసం తొలిరోజు నరసాపురం వశిష్ఠ గోదావరిలో పుణ్యస్నానాలు.. దీపాలు వదులుతున్న భక్తులు

పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి, భీమవరం సోమేశ్వరస్వామిలకు ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న అర్చకులు.. పెద్ద సంఖ్యలో భక్తులు ఆయా ఆలయాలను దర్శించారు.

అభిషేకాల అనంతరం.. ప్రత్యేక అలంకరణలో పట్టిసం వీరభద్రేశ్వరస్వామి

ఉద్యోగులు.. పెన్షనర్లు..

ఆల్ హ్యాపీ!



- ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ అదనంగా నెలకు రూ.7 కోట్లు
- బకాయిల రూపేణా మరో రూ.130 కోట్లు ప్రయోజనం
- 21వేల మంది రెగ్యులర్, 14వేల మంది పెన్షనర్స్‌కు గిఫ్ట్

ఏలూరు అర్బన్/నిడమర్రు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, పెన్షనర్లకు కరవు భత్యం (డీఏ/డీఆర్) బకాయిల చెల్లింపులో ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించింది. రెగ్యులర్, రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఒక విడత డీఏ 3.64శాతం బకాయి ఒకేలా లభించేలా నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు 21 నెలల డీఏ/డీఆర్ బకాయిలను 4 విడతల్లో చెల్లించడానికి జీవో 63 సవరణ ఉత్తర్వులను ఆర్థిక శాఖ విడుదల చేయడంతోపాటు, అక్టోబరు జీతభ త్యాల బిల్లులను ఖజానా శాఖకు సమర్పించేందుకు వీలుగా వెసులుబాటు కల్పిస్తూ బుధవారం డీడీవోలు/డీటీవో/ఎస్టీవోలకు ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు జిల్లాలో ఉద్యోగుల అక్టోబరు జీతభత్యాల చెల్లింపు బిల్లులను ట్రెజరీలకు ఇప్పటికే సమర్పించి ఉన్నా లేదా బిల్లులను ఆమోదించినా వాటిని రద్దుచేసి, పెంచిన డీఏకు అనుగుణంగా బిల్లులను సవరించి మళ్లీ అంద జేసేలా డీడీవోలకు అవకాశం కల్పిస్తూ ఆర్థికశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పెరిగిన డీఏను నగదు రూపంలో నవంబరు నుంచే అందుకోవడంతోపాటు, 21నెలల బకాయిలను మూడు విడతల్లో ఉద్యోగులు, పెన్షనర్లకు వెసులుబాటు లభించినట్టయింది.

జిల్లాలో డీఏ ప్రయోజనం నెలకు రూ.7 కోట్లు

ఏలూరు జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 21,152 మంది రెగ్యులర్ ఉద్యోగులు, మరో 14 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులున్నారు. వీరందరికీ పెంచిన డీఏ/డీఆర్ ప్రయోజనాలు వర్తిస్తాయి. ఆ ప్రకారం జిల్లాలో వీరందరికీ జీతభత్యాలు, పెన్షన్లరూపేణా నెలకు సుమారు రూ. 200 కోట్లు చెల్లిస్తున్నారు. తాజాగా ఒకవిడత డీఏ/డీఆర్ 3.64 పెంపువల్ల సుమారు రూ.7 కోట్లు అదనంగా ఆర్థిక ప్రయోజనం వీరందరికీ దక్కుతుంది. ఇక డీఏ/డీఆర్ బకాయిల రూపంలో జనవరి 2024 నుంచి ఈ ఏడాది సెప్టెంబరు వరకు మొత్తం 21 నెలల కాలానికి రూ.130 కోట్లు విడతల వారీగా చెల్లించాల్సి ఉంటుందని ఖజానా శాఖ లెక్కలు కట్టింది. ఈ మొత్తంలో 10శాతం నగదును వచ్చే ఏడాది ఏప్రిల్, మిగతా 90శాతం మొత్తాన్ని మూడు సమాన వాయిదాల్లో అంటే వచ్చే ఏడాది ఆగస్టు, నవంబరు, 2027 ఫిబ్రవరిలో 30శాతం చొప్పున చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు.

ఉద్యోగ సంఘాల హర్షం

ప్రభుత్వ ఉద్యోగులకు 21 నెలల డీఏ బకాయిలు చెల్లింపు జీవోలు సవరించి 63 జీవో విడుదల చేయడంపై ఏపీ జేఏసీ జిల్లా కన్వీనర్ నెరుసు రామారావు, సహాయ కార్యదర్శి ఆర్ఎస్.హరనాథ్ హర్షం వ్యక్తం చేశారు. జేఏసీ తరపున ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని సవరణ జీవో ఇప్పించడం ఉద్యోగులపై ప్రభుత్వ నిబద్ధత వ్యక్తమైందన్నారు. ఉద్యోగ వర్గాలలో హర్షితిరేకాలు వ్యక్తమవుతున్నాయని తెలియజేశారు. ఉద్యోగుల బాగోగులను ప్రభుత్వం అర్థం చేసుకొందని ఆనందం వెలిబుచ్చారు.

డీఏ బకాయిల చెల్లింపు సంతృప్తికరం

ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల అభ్యర్థనల మేరకు డీఏ బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం సవరణ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం. తాజా ఉత్తర్వులతో ఉద్యోగి సర్వీసు కాలంలోనే డీఏ ఆర్థిక ప్రయోజనాలను నగదు రూపంలో అందుకోవడానికి ఆస్కారం లభించినట్టయింది. ఇప్పటికైనా పీఆర్సీని నియమించి, నివేదిక వచ్చేలోగా 30 శాతం మధ్యంతర భృతి(ఐఆర్)ను ఇవ్వాలని కోరుతున్నాం.

సీహెచ్.శ్రీనివాస్, ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్

గందరగోళానికి తెరదించిన ప్రభుత్వం

దీపావళి కానుకగా పెంచిన డీఏ 3.64 శాతాన్ని అక్టోబరు 2025 నుంచి చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కరువు భత్యం జీవోలు 61, 62లో 21 నెలల బకాయిలు చెల్లింపులో రిటైర్‌మెంట్ నాడు, లేదా చనిపోయిన తర్వాత చెల్లించబడు తుందని పేర్కొనడంతో ఉద్యోగ వర్గాలలో అభ్యంతరాలు వ్యక్తమయ్యా యి. దీనితో ప్రభుత్వం సవరణలు చేసి డీఏ చెల్లింపులో గందరగోళానికి తెరదించింది. చెల్లింపులకు సీఎఫ్ఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు.

సచివాలయ ఉద్యోగులకు

జాబ్ చార్ట్



- పర్యవేక్షణాధికారులుగా ఎంపీడీవోలు, కమిషనర్లు
- జిల్లాలో 495 గ్రామ, 110 వార్డు సచివాలయాలు
- సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం

ప్రజలకు సుస్థిర పాలన అందించడంతో పాటు సంక్షేమ పథకాల పర్యవేక్షణకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు జాబ్‌చార్టు అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వారిపై చర్యలకు మాత్రం కలెక్టర్‌కే విశేష అధికారులను అప్పగించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, పట్టణ స్థాయిలో మునిసిపల్ కమిషనర్లు జాబ్ చార్టు అమలును పర్యవేక్షించనున్నారు. ప్రాధాన్యత క్రమంలోనే అత్యవసరంగా పనులకు వీరు కదలాల్సి ఉంటుంది. 2047 విజన్ లక్ష్య సాధనలో సచివాలయ ఉద్యోగుల సేవలను పక్కాగా ప్రభుత్వం వినియోగించుకోనుంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం పలు సంస్కరణలు చేస్తోంది. ఇప్పటికే డివిజన్ స్థాయిలో డీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేసింది. ఇటీవల గ్రామ, వార్డు సచివాలయాలకు పర్యవేక్షణ అధికారులను నియమించింది. మండలాల్లో సచివాలయాలను పర్యవేక్షణ బాధ్యతలను ఎంపీడీవోలకు అప్పగించగా, పట్టణాల్లో మునిసిపల్ కమిషనర్లే చూస్తారు. ఈ నెల 17న ఈ మేరకు ప్రభుత్వం పర్యవేక్షణాధికారులకు బాధ్యతలను అప్పగించాలని ఆదేశించగా, కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో 27 మండలాల్లో ప్రస్తుతం ఉన్న ఎంపీడీవోలకే బాధ్యతలను అప్పగిస్తూ జడ్పీ సీఈవో శ్రీహరి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో 495 గ్రామ సచివాలయాలు, ఏలూరు కార్పొరేషన్, నూజివీడు, చింతలపూడి మునిసిపాల్టీలతో పాటు చింతలపూడి నగర పంచాయతీలో 110 వార్డు సచివాలయాలు పనిచేస్తున్నాయి.

గతంలో పర్యవేక్షణ గాలికే..

గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి పర్యవేక్షణ గాలికొదిలేసింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గ్రామ పరిపాలనపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో భాగంగా మండల సచివాలయ అధికారులను నియమించారు. రాబోయే కాలంలో మండలాల్లో ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలు పనిచేస్తారు. ఒకరు పంచాయతీలు, మరొకరు సచివాలయ వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో గ్రేడ్ -1 కార్యదర్శులు, సీనియర్ సహాయకుల్లో అర్హులకు పదోన్నతి కల్పించి పూర్తిస్థాయిలో సచివాలయ అధికారులను నియమించనున్నారు. ప్రజలకు పాలన మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమించింది.

ఇక పక్కాగా విధులు

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది విధుల నిర్వహణపై ప్రభుత్వం కీలక ఆదేశాలను జారీ చేసింది. ఒక సమయంలో ఒకటి కంటే ఎక్కువ పనులు వారికి అప్పగిస్తూ వివిధ శాఖలు ఆదేశాలు జారీ చేస్తున్నాయంటూ ఆయా సంఘాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించి నిర్దిష్టమైన చార్టును విడుదల చేసింది

- గ్రామ, వార్డుస్థాయి అభివృద్ధి ప్రణాళికల పనులన్నింటిలో పాల్గొనాలి.
- ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, విస్తరణ కార్యక్రమాల్లో పాల్గొనాలి.
- ప్రభుత్వ ఆదేశాల మేరకు వారి పరిధిలోని పౌరుల సమాచారాన్ని సేకరించాలి.
- ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను వారి ఇళ్ల వద్దే అందించాలి.
- స్థానికంగా అందిన ఫిర్యాదుల పరిష్కారానికి నిరంతర అనుశీలన చేపట్టాలి.
- విపత్తు సమయాల్లో అత్యవసర విధులు నిర్వర్తించాలి.
- ప్రభుత్వం సమయానుసారం జారీచేసే ఆదేశాలకు అనుగుణంగా వారికి అప్పగించే ఏ పనులైనా నిర్వర్తించాలి.
- ప్రభుత్వం నిర్ణయించిన పరీక్షలకు అర్హత సాధించాలి.

ఈ జాబ్ చార్టు అమలు బాధ్యతలను కలెక్టర్ లేదా నియామక అధికారులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విధులను అమలు చేయకపోతే బాధ్యులపై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

ఎనర్జీ అసిస్టెంట్లు ఏమయ్యారు!

ఏలూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సచివాలయాలలో ఎనర్జీ అసిస్టెంట్లు కనిపించడం లేదు.. వారు ఎక్కడున్నారో..? ఏ పనులు చేస్తున్నారో..? ప్రజలకు తెలియడం లేదు. విద్యుత్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో ఎనర్జీ అసిస్టెంట్లు (జేఎల్ఎం గ్రేడ్-2)ను 2019లో నియమించారు. ఐదేళ్లు గడిచినా చాలామంది ఉద్యోగులు సచివాలయాల గడప తొక్కిన దాఖలాలు లేవు. జిల్లాలో 470 మంది ఎనర్జీ అసిస్టెంట్లను నియమించారు. వారి విధులపై విద్యుత్ శాఖ, సచివాలయ వ్యవస్థ ఉన్నతాధికారుల మధ్య సమన్వయం లోపించింది. వారు సచివాలయాల విధులకు హాజరవుతున్నారని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. అలాంటి ఉద్యోగులను చూసింది లేదని సచివాలయ అధికారులు అంటున్నారు. ఆ ఉద్యోగులకు మాత్రం సచివాలయ పరిధిలో పనిచేయాలా? లేక విద్యుత్ శాఖ పరిధిలో అన్నది ఇప్పటికీ తేలలేదు. సచివాలయ ఉద్యోగులకు అందుతున్న ప్రయోజనాలు కానీ.. విద్యుత్‌శాఖ ప్రయోజనాలు కానీ పొందలేని స్థితిలో ఉన్నారు.

గిరిజనుల త్యాగమే పోలవరం

పోడు భూములకు పట్టాలివ్వాలి.. సీపీఐ కార్యదర్శి నారాయణ

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లు

అంబేడ్కర్ వర్సిటీకి భూములు ఎక్కడ ?

కలెక్టర్ వెట్రిసెల్వితో సమావేశమైన ఇన్‌చార్జి వీసీ

రూప్‌చంద్ ధర ధమాల్

కనిష్ఠ స్థాయికి ధర.. కేజీ రూ.80

డీలా పడ్డ ఆక్వారైతు

లోపలి పేజీల్లో





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

91.1 శాతం అర్జీలు పరిష్కారం

ఏలూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీజీఆర్ఎస్‌లో 13వే562 దరఖాస్తులు రాగా 91.1 శాతం మేర పరిష్కరించామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి భూ పరిపాలన కమిషనర్(సీసీఎల్ఏ) జి.జయలక్ష్మికి వివరించారు. సచివాలయం నుంచి పీజీఆర్ఎస్, ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ, సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్, జిల్లాల విభజనపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 12,530 దరఖాస్తులను పీజీఆర్ఎస్‌లో పరిష్కరించామని, ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిరుపేదలకు ఇళ్లపట్టాల పంపిణీలో భాగంగా జిల్లాలో 8,420 దరఖాస్తులు అందాయని, వాటిలో 2,341 మంది అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు.

పోలవరం పునరావాసాలకు 2,799 ఎకరాలు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస కార్యక్రమాలకు జిల్లాలో 2799.60 ఎకరాల భూమిని గుర్తించామని కలెక్టర్ వెట్రిసెల్వి జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌కు తెలిపారు. సచివాలయం నుంచి ఆయన పోలవరం ప్రాజెక్టు, పునరావాస కార్యక్రమాలపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పునరావాస ప్యాకేజీలో 1743 ఎకరాల భూమి భూసేకరణ దశలో ఉందన్నారు.

ధాన్యం కొనుగోలులో ముందుండాలి

ఏలూరు సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ఏలూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచేలా అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి బుధవారం సాంకేతిక శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ సూచనలు ఇచ్చారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, సాంకేతిక అంశాలను సిబ్బందికి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది కంటె లక్ష మెట్రిక్ టన్నుల అదనంగా సేకరించడం లక్ష్యం అన్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- నిర్దేశిత కార్యాచరణ ప్రణాళిక అమలు
- ఉత్తీర్ణత పెరగడానికి మెరుగైన బోధన అందించాలి
- హెచ్‌ఎంలతో డీఈవో వెంకట లక్ష్మమ్మ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

ఏలూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళిక మేరకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను కచ్చితంగా నిర్వహించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. స్థానిక సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో ఏలూరు డివిజన్‌లోని 11 మండలాల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పది పరీక్షల్లో ఉత్తీర్ణత పెరిగేలా నాణ్యతతోకూడిన బోధన జరిగేలా చూడాలని కోరారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు టీచర్లు వ్యక్తిగత శ్రద్ధతో బోధించాలని సూచించారు. డిసెంబరులో టీచర్లందరూ ఒకేసారి సీఎల్స్ ఉపయోగించుకునేందుకు అనుమతించబోమని, ఆ మేరకు క్యాజువల్ లీవులను పెట్టుకునేందుకు మార్గదర్శకాలను పాటించేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల రోజువారీ హాజరుపై సమీక్షించారు. విద్యార్థి సమగ్ర విద్యా సమాచారాన్ని అందజేసేందుకు ఉద్దేశించిన అపార్ ఐడీల నమోదు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలవారీగా ఉపాధ్యాయుల శాంక్షన్డ్ పోస్టులు, వర్కింగ్, వెకెన్సీల వివరాలను సేకరించారు. డీవైఈవో రవీంద్రభారతి, సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆశ, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటప్పయ్య, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, రవీంద్ర, సమగ్రశిక్ష ఏఎంవో రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో 33.8 మి.మీ. వర్షపాతం

ఏలూరు సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడచిన 24 గంటలలో అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 33.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 5.4 మిల్లీమీటర్లుగా నమోదైంది. టి.నరసాపురంలో 17.4, పోలవరంలో 15, ద్వారకాతిరుమలలో 14.2, కామవరపుకోటలో 12.2, ముసునూరులో 9.4, చింతలపూడిలో 7.2, ఆగిరిపల్లిలో 6.8, కుక్కునూరులో 6.8, కైకలూరులో 6, లింగపాలెంలో 5.6, ఏలూరు అర్బన్‌లో 5.6, నూజివీడులో 3.2, చాట్రాయిలో 2.6, బుట్టాయిగూడెంలో 2, ఏలూరు రూరల్ లో 1.8, మండవల్లిలో 1.6, దెందులూరులో 0.8, భీమడోలులో 0.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. అల్పపీడనం వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేయడంతో కోతల వేళ ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





పెదపాడులో నేలకొరిగిన వరి, ద్వారకాతిరుమల ఆలయం వద్ద జోరు వాన

జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం

ద్వారకాతిరుమల/పెదపాడు/కైకలూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం జోరుగా వర్షాలు కురిశాయి. భారీ వర్షాలతో జనజీవనం స్తంభించింది. ఏలూరు నగరంతోపాటు కైకలూరు నియోజకవర్గాలు, పెదపాడు, ద్వారకాతిరుమల, పెదవేగి, కామరపుకోట తదితర మండలాల్లో వర్షాలు కురిశాయి. ఈదురు గాలులతో కూడిన వర్షాల వల్ల పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ద్వారకాతిరుమలలో వర్షం దంచి కొట్టింది. ఉదయం ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారి మధ్యాహ్నం వర్షం కురిసింది. తిరిగి సాయంత్రం కుండపోత

మిగతా 8వ పేజీలో..



తీరంలో కార్తీక శోభ

నరసాపురం వలంధర్‌రేవు వద్ద దంపతుల నోములు

నరసాపురంలో భక్తుల పుణ్యస్నానాలు

నరసాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నరసాపురం తీరంలో బుధవారం కార్తీకమాసం కళ నెలకొంది. తెల్లవారుజామునే భక్తులు పుణ్యస్నానాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని వలంధర్, అమరేశ్వర, మండలంలోని రాజ్లుంక రేవుల్లో గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం రేవులో పరమశివుడ్ని దర్శించుకున్నారు. గట్టుపై కార్తీక నోములు నోచుకున్నారు. అనంతరం అరటి డొప్పలపై గోదావరిలో దీపాలు విడిచిపెట్టారు. స్థానికులతో పాటు జిల్లా నలుమూలల నుంచి పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు తరలిరావడంతో వలంధర్‌రేవులో సందడి నెలకొంది. గోదావరిలో నీళ్లు లేకపోవడంతో చాలామంది షవర్ కింద స్నానాలు చేశారు. ఇటు రేవులో రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి దీపాలు వెలిగించారు. ఇటు పట్టణ, మండలంలోని శివాలయాల్లో శివనామస్మరణ మార్మోగింది. చాలామంది పరవశివుడ్ని దర్శించుకుని అభిషేకాలు చేయించుకున్నారు. పట్టణంలోని అమరేశ్వర, కపిలమల్లేశ్వర, ఏకాంబేశ్వర, మండలంలోని లక్ష్మణేశ్వరం శివాలయాల్లో భక్తులు రద్దీ కనిపించింది. అనేకమంది కార్తీకమాస ఉపవాసాలు అచరించారు. రాత్రి ఆలయాల్లో దీపారాధన చేసి ఉపవాసాలను విరమించారు.



ప్రత్యేక అలంకరణలో భీమవరం గునుపూడి సోమేశ్వరస్వామి



పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల పూజలు



ఆచంటేశ్వరుని ఆలయంలో భక్తులు.. (ఇన్‌సెట్‌లో) స్వామికి క్షీరాభిషేకం

శంభో శంకర..

- వైభవంగా ప్రారంభమైన కార్తీక మాసం పూజలు
- ఆలయాల్లో మార్మోగిన శివ నామస్మరణ
- పాడ్యమి దీపాలు వెలిగించిన భక్తులు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలిరోజు బుధవారం పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో శివ నామస్మరణ మార్మోగింది. స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు కావాల్సిన సౌకర్యాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, పాలకమండలి చైర్మన్ మీసాల రాము మాట్లాడుతూ స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న దాన పథకానికి గాను ఇప్పటి వరకు వచ్చిన విరాళాలు రూ.47.06.539 అని తెలిపారు. క్యాష్‌బుక్‌లో రూ.9.26.105, ఎఫ్‌డీఆర్‌గా రూ.30.00.000, చెక్కుల రూపంలో రూ.7.18.333 నగదుగా రూ.62.101 వచ్చాయని తెలిపారు.

గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో..

భీమవరంటౌన్ : భీమవరంలోని పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామిని దర్శించుకునేందుకు క్యూకట్టారు. మహిళలు పాడ్యమి దీపాలను వెలిగించి కార్తీకమాస దీక్షను చేపట్టారు.

ఆచంటేశ్వరుని ఆలయంలో..

ఆచంట : ఆచంటలో ప్రసిద్ధిచెందిన ఆచంటేశ్వరుని ఆలయం వేకువజాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. రామగుండం చెరువులో భక్తులు పాడ్యమి దీపాలు వెలిగించి అనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, ఆలయ చైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు భగినీ హస్త భోజనం

అన్నాచెల్లెళ్ల పండుగ



ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్తీక శుద్ధ విదియ రోజున ఏ వయస్సులో వారైనా కులమతాలకు అతీతంగా వారి సోదరి చేతి భోజనం భుజించడం ద్వారా అన్నాతమ్ముళ్లకు, అక్కాచెల్లెళ్లలకు ఈ ఏడాదంతా శుభమే జరుగుతుందని పురాణాలు తెలుపుతున్నాయని దీనినే భగినీ హస్తభోజనం అంటారని ఏలూరు రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం అర్చకుడు కిళాంబి మారుతి శ్రీనివాసరామానుజాచార్యులు తెలిపారు. ఈ కార్తీక శుద్ధ విదియ (గురువారం) రోజున తన సోదరి ఎంత దూరాన్న ఉన్నప్పటికీ ఆమె చేతి భోజనం భుజిస్తే శుభాలు కలుగుతాయన్నారు. దీనికి సంబంధించిన పురాణ కథ ఉందని తెలిపారు.

కార్తీక పాడ్యమి రోజు సత్యభామ చేతిలో నరకుడి పీడ విరగడైందని, ఆ రాక్షసుని బాధల నుంచి విముక్తి కల్పించిన సత్యభామను ఇంటి ఆడపడుచుగా ఆనాటి ప్రజలు విదియనాడు సత్కరించారని తెలిపారు. ఆనాటి నుంచి నేటి వరకు కార్తీక విదియనాడు ఆడపడుచులకు, తమ శక్తిమేర కట్నకానుకలు ఇచ్చి సోదరి ఇంట్లో లేదా వరుసకు సోదరి ఇంటిలోనైనా భోజనం చేయడం ద్వారా మంచి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సోదరుడు సోదరికి చీర, జాకెట్టు, పసుపు, కుంకుమ ఇచ్చి తీపి పదార్థాన్ని అందిస్తారు. పురాతన కాలం నుంచి ఈ ఆనవాయితీని కార్తీక విదియనాడు అమలు చేస్తున్నారన్నారు. కార్తీక శుద్ధ విదియ రోజు సోదరి పిండి వంటలు, భోజనం చేసిన వారికి అపమృత్యు దోషం కలుగకుండా ఉండేలా పరమశివుడు వరమిచ్చినట్టు పురాణాల్లో ఉందని వివరించారు.

కిటకిటలాడిన శివదేవుని ఆలయం



ద్వారకాతిరుమల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయం కార్తీకమాసం ప్రారంభరోజు కావడంతో భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయాన్ని, పరిసరాలను పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో అభిషేకాలు జరిపారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలోని ఉసిరిచెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. శివదీక్ష చేపట్టిన పలువురు శివస్వాములు, స్థానికులు, భక్తులతో ఆలయ ప్రాంగణములో కళకళలాడింది.



ద్వారకాతిరుమల శివాలయంలో భక్తులు (ఇన్‌సెట్‌లో) స్వామివారు



మద్ది ఆంజనేయ స్వామికి లక్ష పుష్పార్చన

మద్ది క్షేత్రంలో లక్ష పుష్పార్చన

జంగారెడ్డిగూడెం/పోలవరం : జంగారెడ్డిగూడెం మండలంలోని గుర్వాయిగూడెంలో వున్న మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో కార్తీక మాస మహోత్సవాలను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత ఆలయం వద్ద ఎమ్మెల్యేరే ఈవో ఆర్‌వి.చందన ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లక్ష పుష్పార్చన : కార్తీక మాసోత్సవాలలో భాగంగా బుధవారం మద్ది ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తికి లక్ష చామంతి పూలతో పుష్పార్చన కార్యక్రమం వేద పండితులు, రుత్వికులచే నిర్వహించారు.



మద్ది క్షేత్రంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

పట్టిసీమలో భక్తుల తాకిడి

పోలవరం : పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. జిల్లాలో నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి పట్టిసీమ శివ క్షేత్రాన్ని దర్శించారు. అర్చకులు స్వామికి బిల్వార్చన భస్మార్చన ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది భక్తులకు అన్నదానం ప్రసాద వితరణ చేశారు. ఈవో మాట్లాడుతూ ప్రతి సోమవారం ఆలయ ఆవరణలో భజన, కోలాట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నవంబరు 11న గోదావరి హారతి జ్వాలాతోరణం, గ్రామసేవ, 15న దేవస్థానంలో లక్ష దీపోత్సవం నిర్వహిస్తామన్నారు.

నేత్రపర్వం.. సుందర గిరిపై సుదర్శన హోమం



సుదర్శన నృశింహ యజ్ఞాన్ని నిర్వహిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి) : ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువు దీరిన లక్ష్మీనారసింహుని ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం విశేష కార్యక్రమాలు జరిగాయి. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో సుందరీకరించిన యాగశాలలో పుణ్యాహ వాచన, కలశస్థాపన నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చరణల నడుమ శ్రీసుదర్శన నృశింహ ధన్వంతరి గరుడ ఆంజనేయ అనంత మూల మంత్రహోమం జరిగింది. మూలవిరాట్‌కు విశేషద్రవ్యాలతో అభిషేకం, అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో అమెరికన్ వైద్యులు



ఆలయం వద్ద అమెరికన్ వైద్యులు

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని అమెరికన్ వైద్యులు బుధవారం దర్శించుకున్నారు. ఏలూరుకు చెందిన రోషిణి చిన్నతనం నుంచి అమెరికాలో చదువుకుని వైద్యవృత్తిలో స్థిరపడ్డారు. ఈక్రమంలో ఆమె తన స్నేహితులతో కలిసి ద్వారకా తిరుమల క్షేత్రానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

తక్కువ వ్యవధిలో విద్యుత్ కనెక్షన్

- ఈపీడీసీఎల్ కొత్త విధానం
- దరఖాస్తుతోనే స్థిర చార్జీల వసూళ్లు
- రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా శ్రీకారం

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ల జారీకి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కొత్త విధానం అమలులోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకు కొత్త కనెక్షన్ కావాలంటే దరఖాస్తు సమర్పించిన తరువాత స్థల పరిశీలన చేసి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసేవారు. దానిపై సర్వీస్ లైన్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు. తనిఖీకి వచ్చిన అధికారి విచక్షణపై ఈ మొత్తం ఆధారపడి ఉండేది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఈజ్ ఆఫ్ లివింగ్‌ను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ విద్యుత్ వినియోగదారుల చట్టం 2020కి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కొన్ని సవరణలు చేయడంతో ఏపీఈపీడీసీఎల్ కొత్త విధానం తీసుకువచ్చింది. 150 కిలోవాట్ల వరకు కనెక్షన్లకు ఫిక్స్‌డ్ చార్జీలు నిర్ణయించారు. ఈ మొత్తాన్ని దరఖాస్తుతో పాటు చెల్లిస్తే వెంటనే కనెక్షన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ అయిపోతాయి. దీనివల్ల చాలాతక్కువ సమయంలో విద్యుత్ సదుపాయం లభిస్తుంది. సైట్ ఇన్‌స్పెక్షన్, ఎస్టిమేషన్ వంటివి ఉండవు.

ఎవరికి వర్తిస్తుందంటే..?

ఇప్పటికే విద్యుత్ సదుపాయం ఉన్న ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ఉన్నవారు కొత్త కనెక్షన్ తీసుకుంటే చార్జీలు ఇలా ఉంటాయి.

- గృహ వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,500.
- వాణిజ్య వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,800.. ఆపై ప్రతి అదనపు కిలోవాట్‌కు రూ.2 వేలు చొప్పున తీసుకుంటారు. ఇలా 20 కిలోవాట్ల వరకు లెక్కించి తీసుకుంటారు.
- ఇవికాకుండా కనెక్షన్ లోడ్ చార్జీల (డొమెస్టిక్) కింద సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ చార్జీలు కలిపి 500 వాట్ల వరకు రూ.800, ఆపై 501 నుంచి 1000 వాట్ల వరకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది..
- నాన్ డొమెస్టిక్/కమర్షియల్ కనెక్షన్లకు మొదటి 250 వాట్ల వరకు రూ.600, 251 వాట్ల నుంచి 500 వాట్ల వరకు రూ.1,000 కట్టాలి. ఇలా ఎల్‌టీ-3, ఎల్‌టీ-4, హెచ్‌టీ కనెక్షన్ కోరుకునే వారికి చార్జీలు నిర్ణయించారు.

ముందుగా చెల్లించడంతో తక్షణ సేవలు



స్థిరమైన చార్జీలు ముందుగానే నిర్ణయించడం వల్ల ఎస్టిమేషన్ పేరుతో జాప్యం ఉండదు. విచక్షణ అధికారంతో అంచనాలు పెంచే అవకాశమూ లేదు. ఎవరికి ఎంత విద్యుత్ లోడ్ పడుతుందో లెక్కించుకుని ఆ మేరకు చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. దీని వల్ల తక్షణమే సేవలు అందించగలుగుతాము. ఇదంతా పూర్తి పారదర్శకంగా ఉంటుంది.

- పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్

రూప్‌చంద్ ధర ధమాల్ !

• డీలా పడ్డ ఆక్వారైతు



కనిష్ఠ స్థాయికి ధర.. కేజీ రూ.80

- మేతలు, లీజులు కూడా రాని చేపల సాగు
- కేజీకి రూ.35 వరకు నష్టం
- జూన్ చివరి నుంచి ధర పతనం ప్రారంభం
- చేపల మేత పంపిణీకి వెనుకాడుతున్న ఫీడ్ కంపెనీలు
- సొమ్ము కడితేనే చేపల మేత దిగుమతి
- అక్కరకు రాని చేపల సాగు

కోస్తా తీర ప్రాంతంలో చేపల సాగులో ప్రధానంగా రూప్‌చంద్ ధర అత్యంత కనిష్టస్థాయికి చేరుకుంది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ ఈ ధర పలకలేదని ఈ ధర వల్ల రూప్‌చంద్ సాగు చేసే రైతులు తీవ్రనష్టాలలో కూరుకుపోతున్నారు. సాగు కష్టమవుతోందని, కనీసం మేతలు, లీజులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. చేపల మేతలు అందించే ఫీడ్ కంపెనీలు సొమ్ము కడితేనే అందిస్తామని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- నిడమర్రు అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

కనిష్ట స్థాయికి రూప్‌చంద్ ధర

ఈ సంవత్సరం జూన్ చివర నుంచి రూప్‌చంద్ ధర పతనం కావడం ప్రారంభమైంది. రైతు వద్ద రూ.114- 115 పలికిన చేప ధర పతనమవుతూ ప్రస్తుతం గత ఐదేళ్లలో కనిష్ట స్థాయి రూ.80కు దిగజారింది. ఇప్పుడున్న మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ ధర ఇంకా పతనమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇదే జరిగితే గోదావరి, కృష్ణా ఆయకట్టు ప్రాంతంలో ఇకమీదట చేపల చెరువుల జోలికి వెళ్లేలేని పరిస్థితి దాపరిస్తుందని వాపోతున్నారు.

చేప పెంపకంలోనే రూ.15 నష్టం

ఈ సంవత్సరం జూలై ప్రారంభం నుంచి రూప్‌చంద్ చేప ధర పతనం అవుతోంది. ముఖ్యంగా జూన్ 15న కేజీ రూప్‌చంద్ ధర రూ.114 ఉండగా ప్రస్తుతం అక్టోబరుకు రూ.80 కనిష్ట ధరకు చేరింది. ఒక కేజీకి సుమారు రూ.40 రైతు నష్టపోతున్నాడు. చేప పెరుగుదలకు కేజీకి రూ.95 నుంచి రూ.100 వరకు రైతుకు ఖర్చు అవుతుండగా లాభం లేకపోగా సుమారు రూ.15 నష్టపోతున్నాడు. ఒక లారీ పది టన్నుల సరుకు పడితే రైతుకు సుమారు రూ.1.5 లక్షలు నష్టం వస్తోంది. ఈవిధంగా ఉంటే రైతు పరిస్థితి ఏమి కావాలని ఆందోళన చెందుతున్నారు. కనీస పెట్టుబడులు రాకపోతే ఎలా అని ఆవేదన చెందుతున్నారు.

వెనుకాడుతున్న ఫీడ్ కంపెనీలు, డీలర్లు

రూప్‌చంద్ చేప ధర కనిష్ట స్థాయికి చేరడంతో చేపలు పట్టడానికి రైతుల ముందుకు రావడం లేదు. గత సంవత్సర కాలం నుంచి చేపల చెరువులకు మేతల పెట్టుబడులు పెడుతున్న ఫీడ్ కంపెనీలు, డీలర్లు ఇంకా పెట్టుబడులు పెట్టలేక ఇబ్బందులు పడుతూ వెనుకంజ వేస్తున్నారు. ఫీడ్ కంపెనీలు, డీలర్లు మేతకు అరువులు పెట్టలేక సొమ్ము చెల్లిస్తేనే మేత పంపుతామని చెబుతున్నారు. ఇప్పటికే తాము చాలా సొమ్ము అరువుగా ఇచ్చామని ఇక ఇవ్వలేమని సొమ్ము చెల్లిస్తేనే మేతలు పంపగలమని తేల్చి చెబుతున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల కొకసారి మేత చల్లాల్సి వస్తుందని, ఈవిధంగా అయితే చేప పెరుగుదల వెనక్కి పోతుందని భయాందోళన చెందుతున్నారు.

ధర పతనానికి కారణాలు

- ఇటీవల ముగిసిన దసరా నవరాత్రులు, దీపావళి.. ప్రస్తుత కార్తీక మాసం పండుగల ప్రభావంతో రూప్‌చంద్ ధర తగ్గడానికి కారణమని ట్రేడర్స్ చెబుతున్నారు. మరో రెండు మూడు నెలలు ఇదే పరిస్థితి ఉండవచ్చని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.
- ఓ వైపు పెరుగుతున్న చేపల సరుకు టన్నేజి పెరగడంతో మార్కెట్‌పై విపరీతమైన ఒత్తిడి పడుతోంది. మార్కెట్‌కు వస్తున్న సరుకు ఎక్కువగా ఉండడం వల్ల ధర తగ్గుతుంది.
- ఆక్వా రంగం అత్యున్నత స్థాయిలో ఉన్నప్పుడు మేతలు, మందులకు జీఎస్టీ పేరుతో కోట్లలో రాబడి సంపాదించినా ప్రభుత్వం ప్రస్తుతం నష్టాల్లో ఉన్న రైతును ఆదుకోవడానికి ముందుకు రాకపోవడం శోచనీయం .

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి



గత కొంత కాలంగా రూప్‌చంద్ ధర పతనం రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా కేజీ రూప్‌చంద్ ధర రూ.80 నుంచి రూ.82 మధ్య కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక కేజీ రూప్‌చంద్ చేప తయారీకి సుమారు రూ.90-95 వరకు ఖర్చు అవుతుండడంతో రైతు నష్టానికే పట్టుబడులు పట్టాల్సివస్తోంది. ప్రభుత్వం ట్రేడర్స్‌తో చర్చలు జరిపి గిట్టుబాటు ధరకు చర్యలు తీసుకోవాలి.

మేకా వెంకట రమణ, ఆక్వా రైతు, పెదనింద్రకొలను

ఫీడ్ ధరలు తగ్గించాలి



. ఇటీవల కాలంలో ధర బాగా పతనం కావడంతో గిట్టుబాటు కావడం లేదు. ఈ ధరకు కనీసం మేత రేట్లు, లీజులు రావడం లేదు. కరోనా సమయంలో కూడా ఇంత తక్కువ ధర లేదు. డీలర్లు మేతలు అందించలేక పోతున్నారు. ప్రభుత్వ పెద్దలు ఫీడ్ కంపెనీలతో చర్చించి ఫీడ్ ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ఒడిశా రాష్ట్రం చెరువుల తవ్వకానికి రైతుకు సబ్సిడీలు అందించి పోత్సహిస్తోంది. ప్రభుత్వం ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని లేకపోతే రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొంది.

- పసుపులేటి వెంకటేశ్వరరావు ఆక్వా రైతు, గణపవరం

మునిసిపల్ కార్మికుల ధర్నా

- నవంబరు మూడు నుంచి నిరవధిక సమ్మెకు సన్నాహం

ఏలూరుటూటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే డిమాండ్ చేశారు. ఏలూరు మునిసిపల్ కార్యాలయం వద్ద బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు 2023 సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఇంజనీరింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. 11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు కిశోర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే నవంబరు మూడో తేదీ నుంచి నిరవదిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఉప్పులూరి హేమశంకర్, ఎ.లక్ష్మీఇందిరా, వరప్రసాద్, ఎస్.సుబ్బారావు, నారాయణ రావు, ఎస్‌కే.అలీ, కె.శ్రీనివాసరావు, సీహెచ్ అప్పారావు, బంగారు అక్కమ్మ, ధనియాల రమణమ్మ పాల్గొన్నారు.

● భీమవరంటౌన్: మునిసిపల్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని, ప్రభుత్వం మొండి వైఖరిని వీడి ఇచ్చిన హామీలను అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ఆందోళన నిర్వహించారు. నాయకులు నీలాపు శ్రీను, రెల్ల రాము, బి.సత్యనారాయణ, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



ఏలూరు మునిసిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకుల ధర్నా

● తాడేపల్లిగూడెం :మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఓవీ రాజు మందలపర్తి హరీష్, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

● తణుకు: సమస్యలు పరిష్కారం కోరుతూ మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్ కె.ఈశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, మునిసిపల్ వర్కర్సు యూనియన్ గౌరవాధ్యక్షుడు బొద్దాని నాగరాజు మాట్లాడుతూ కనీసవేతనం రూ.26వేలు అమలు చేయాలని, 12వ పీఆర్సీ ప్రకటించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మునిసిపాలిటీ విస్తరణకు అనుగుణంగా డైలీ వేజ్ కార్మికుల నిష్పత్తి పెంచాలని డిమండ్ చేశారు.



లాంగ్‌జంప్

ఎస్జీఎఫ్ స్కూల్ గేమ్స్ ప్రారంభం

పెదవేగి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పెదవేగిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 19ఏళ్ల విభాగం స్కూల్ గేమ్స్ బుధవారం ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ పోటీలు రెండు రోజులపాటు జరుగుతాయని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. బాల, బాలికలకు నిర్వహించిన ఈ పోటీల్లో తొలిరోజు లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్, సాఫ్ట్‌బాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యాలయాల నుంచి 1200మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, డీవీఈవో ఈ.శేఖర్‌బాబు, కె.శ్రీనివాసరావు, గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఏవీ.శివప్రసాద్ పాల్గొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటుకు 50 ఎకరాల భూములు ఎక్కడ ?

- ప్రభుత్వ భవనం ఇస్తేనే విశ్వవిద్యాలయ కార్యాలయం ఏర్పాటుకు అవకాశం
- కలెక్టర్ వెట్రిసెల్విని కలిసిన అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ



మహనీయులతో కూడిన చిత్రపటాన్ని కలెక్టర్‌కు బహూకరిస్తున్న ఇన్‌చార్జి వీసీ

ఏలూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు సమీపంలో ఏర్పాటు చేయతలపెట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీ భవనాల నిర్మాణాలకు అవసరమైన భూముల పరిశీలన, తాత్కాలిక కార్యాలయం, తదితర అంశాలపై బుధవారం విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావు, అధికారులు ఏలూరులో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి చర్చించారు. కలెక్టర్ సూచనల మేరకు గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామవిద్య శిక్షణ కళాశాలకు సమీపంలోవున్న ప్రభుత్వ పోరంబోకు భూములను పరిశీలించారు. అక్కడ ఐదు ఎకరాల భూములే ఉన్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా భూముల విస్తీర్ణం సరిపోవని అభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. ఇదే విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేసినట్టు తెలిసింది. ఏలూరు పరిసరప్రాంతాల్లో పెద్ద విస్తీర్ణంలో ఒకేచోట ప్రభుత్వభూములు అందు బాటులో లేని విషయాన్ని జిల్లా అధికారులు చెప్పినట్టుగా సమాచారం.

ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయ భవనాల నిర్మాణానికి 50 ఎకరాల విస్తీర్ణం గల భూములు అవసరమని, ఆ మేరకు కనీసం 40 ఎకరాలైనా ఉండేలా ఏలూరు సమీపంలో ప్రభుత్వ భూములను కేటాయించాలని విద్యాశాఖ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి కోన శశిధర్‌కు యూనివర్సిటీ అధికారులు విన్నవించనున్నట్టు తెలిసింది. ఇక విశ్వవిద్యాలయ తాత్కాలిక కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేయాలనేదానిపైనా చర్చలు కొనసాగుతాయని చెబుతున్నారు. ఏదైనా ప్రభుత్వ భవనాన్ని ఉచితంగా ఇస్తేతప్ప అద్దె ప్రాతిపదికన బిల్డింగ్‌ను తీసుకుని వర్సిటీ కార్యాలయాన్ని నిర్వహించడానికి ఆర్థిక స్థోమతలేదని అధికారవర్గాలు భావిస్తున్నాయి. అందుతున్న సమాచారం ప్రకారం ఏలూరులో కనీస ఏర్పాట్లు పూర్తయ్యేవరకు ప్రస్తుతానికి యూనివర్సిటీ తాత్కాలిక కార్యాలయాన్ని విజయవాడలోనే ప్రారంభించి, అక్కడి నుంచే రెగ్యులర్ కార్యకలాపాలు కొంతకాలంపాటు జరిగేలా నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఇదిలాఉండగా ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి వచ్చేఏడాది జనవరిలో డిగ్రీ, పీజీ అడ్మిషన్లు ప్రారంభించడానికి వీలుగా యూజీసీ అనుమతి తీసుకునేందుకు వర్సిటీ అధికారుల బృందం ఈ నెలాఖరులో లేదా వచ్చేనెల ఢిల్లీకి వెళ్లనుంది. ఏలూరు సమీపంలో యూనివర్సిటీ ఏర్పాటుకు, అభివృద్ధికి అవసరమైన చర్యలన్నింటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి హామీ ఇచ్చినట్టు ఇన్‌చార్జి వీసీ తెలిపారు. ఆయా రంగాల్లో శతాబ్దాలుగా ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహనీయులతో కూడిన అరుదైన చిత్రపటాన్ని కలెక్టర్‌కు ఇన్‌చార్జి వీసీ బహూకరించారు.

ఏలూరు జిల్లా క్రీడల అధికారిగా అజీజ్ బాధ్యతలు



ఏలూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా (డీఎస్‌డీవో)గా ఎస్ఏ అజీజ్ (సిరాజుద్దీన్) బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఎన్టీయార్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన అతను గతంలో ఏలూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్‌గా పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన బి.శ్రీనివాస రావు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఎన్టీయార్ జిల్లా ప్రధాన కార్యాల యానికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి డీఎస్‌డీవోగా కూడా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

26న బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు

ఏలూరు రూరల్, అక్టోబరు 22, (ఆంధ్ర జ్యోతి): అంతర జిల్లాల సీనియర్స్ పురుష ల, మహిళల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు ఈనెల 26న నిర్వహిస్తామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, గవ్వా శ్రీనివాస్‌రావు ఓ ప్రకట నలో పేర్కొన్నారు. ఏలూరులోని కస్తూరిబా పాఠశాలలో ఉదయం మహిళల జట్టు ఎంపికలు, తాడేపల్లిగూడెంలోని సరస్వతి విద్యాలయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రత్తిపాడులో మధ్యాహ్నం మూడు గంటల నుంచి పురుషుల జట్టు ఎంపికలు నిర్వహిస్తా మన్నారు. ఎంపికైన జట్లు విశాఖపట్నంలో నవంబరు 7 నుంచి 10వ తేదీ వరకు జరిగే 11వ సీనియర్స్ అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. వివరాలకు ట్రెజరర్ కె.మురళీకృష్ణ 94411 71933 నంబరులో సంప్రదించాలన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):ఏలూరులో నిర్వహించాల్సిన అండర్-14 బాలుర జట్టు ఎంపిక పోటీలు వర్షం కారణంగా వాయిదా వేశామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఈ. అశోక్‌కుమార్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27న తిరిగి ఎంపిక పోటీలు జరుగుతాయని, ఈ మార్పును గమనించాలన్నారు.



జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు శనివారపుపేట జడ్పీ విద్యార్థులు

ఏలూరు రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి) :రాష్ట్రస్థాయి జూడో పోటీలకు శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో భాగంగా అండర్-14, 17 బాల బాలికల జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అభిరామ్ హర్ష, శ్రీనివాస్ కల్యాణ్, జాన్సన్, తరుణ్, వెంకట్, మహేష్, జయ రమ్యశ్రీ ప్రతిభ కనబరిచారు. నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను హెచ్‌ఎం ప్రకాశరావు, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ పద్మలత, అభినందించారు.

నవంబరు 4న డీసీసీబీ సమావేశం

ఏలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) సర్వసభ్య సమావేశం నవంబరు 4న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. చైర్మన్‌గా వీరాంజనేయులు బాధ్యతలు స్వీకరించాక ఇదే తొలి సమావేశం. ఇటీవలే డీసీఎంఎస్ మహాజన సభను పూర్తి చేసుకుంది. తాజా డీసీసీబీ సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఆమోదించేందుకు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా తాడేపల్లిగూడెం డీసీసీబీ బ్రాంచి, బజార్ బ్రాంచిల్లో జరిగిన ఆర్థిక అవకతవకలపై అజెండాలో చేర్చినట్లు సమాచారం. సంబంధిత బాధ్యులపై చర్యలకు సిఫారసు చేసే దిశగానే చర్చించి ఆమోదించే అవకాశం ఉంది.

ఈ పాలతో ముప్పే



ఆవులు, గేదెలకు ఇస్తున్న నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజక్షన్



- పాడి పశువులకు నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు
- విచ్చలవిడిగా విక్రయాలు
- మనుషులకు క్యాన్సర్ ముప్పు

పాడి పరిశ్రమలో నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజక్షన్ల వాడకం విపరీతంగా పెరిగింది. పాల దిగుబడి పెంచేందుకు ఆవులకు, గేదెలకు దీనిని ఇస్తున్నారు. లాభాల కోసం పశువుల పెంపకందారులు ఆక్సిటోసిన్ వినియోగాన్ని కొనసాగించడం వల్ల పశువుల ఆరోగ్యంతో పాటు, ప్రజల ఆరోగ్యానికి కూడా ముప్పుగా మారింది.

(తాడేపల్లిగూడెం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి పశ్చిమలో పాలిచ్చే ఆవులు, గేదెలు కలిపి సుమారు 3.75 లక్షలు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో చాలా మంది రైతులు పశువైద్యుల సిఫార్సు లేకుండా వారే ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు పశువులకు చేయిన్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది వ్యాపారులు గుట్టు చప్పుడు కాకుండా ఈ దందా నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. స్థానికంగా మందు దొరకకపోతే గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, నెల్లూరు వంటి ప్రాంతాల నుంచి అక్రమంగా తీసు కొస్తున్నట్లు తెలిసింది. ఆక్సిటోసిన్ వల్ల తాత్కాలికంగా పాల ఉత్పత్తి పెరిగినా ఆ తర్వాత పశువులు ఎదకు రాకపోవడం, చూడు కట్టకపోవడం, హార్మోన్ల లోపాలు వస్తాయని పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చిన్నపిల్లల్లో హార్మోన్ల ప్రభావం ఎక్కువ

ఈ ఇంజక్షన్లు ఇచ్చిన పశువుల పాలను తాగే పిల్లల ఆరోగ్యంపై కూడా దీని ప్రభావం ఎక్కువ చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పిల్లల్లో హార్మోన్ల అసమ తుల్యత, థైరాయిడ్ సమస్యలు, చిన్న వయస్సులోనే రజస్వల కావడం, పెద్దల్లో నరాల బలహీ నత, నిద్రలేమి, ఒత్తిడి సమస్యలు వస్తున్నాయని చెబు తున్నారు. పశువులకు ఆక్సిటో సిన్ వల్ల పాలు సహజ సమతుల్యత కోల్పోతాయి. ఈ పాలను మరిగిం చినా, ప్రాసెస్ చేసినా హార్మోన్ల అవశేషాలు పూర్తిగా తొలగవని చెబుతు న్నారు. ఫలితంగా హార్మోన్ల ప్రభావం మనిషి శరీరంలో తిష్టవేస్తుంది.

నిషేధం ఉన్నా యథేచ్ఛగా వాడకం

ఆక్సిటోసిన్ వాడకాన్ని ప్రభుత్వం ఇప్పటికే నిషేధించింది. ఈ మందు విక్రయం, పంపిణీ, నిల్వ చేసిన వారిపై కఠిన చట్టాలను తీసుకొచ్చింది. అయినా వీటిని బేఖాతర్ చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో అక్రమంగా వాడడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

మనుషులకు క్యాన్సర్ ముప్పు

సాధారణంగా దూడను చూడగానే గేదెకు మిల్క్‌లెట్‌డౌన్ హార్మోన్ విడుదలై పాలు విడుస్తుంది. దూడ చనిపోతే పాలు విడవడానికి గేదె ఇబ్బంది పడుతుంది. అందువల్ల రైతులు దానికి ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు ఇచ్చి పాలు పితుకుతారు. గేదెలకు, ఆవులకు ఆక్సిటోసిన్ ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా వచ్చిన పాలలో సదరు మందు కూడా ఉంటుంది. ఇది మనిషి శరీరంలోకి వెళ్లి తరచూ వాంతులకు గురవడం, కురుపులు, మరికొందరికి క్యాన్సర్ వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పశువులకు కీళ్ల నొప్పివచ్చి, వాటి ఆయుష్షు తగ్గిపోయే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

మినరల్ మిక్చర్‌తో పాల దిగుబడి పెంపు



పాలకోసం రైతులు ఆక్సిటోసిన్ ఇంజక్షన్ ఇస్తున్నారు. ఇది ప్రభుత్వం నిషేధించింది. దీన్ని విక్రయించే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. పాల దిగుబడి పెంపునకు రైతులు మినరల్ మిక్చర్ ఇస్తే నిషేధిత ఇంజక్షన్లను వాడాల్సిన పని ఉండదు. మినరల్ మిక్చర్‌తో పాటు హెర్బల్ గాలెక్ట్ గోక్స్, లెప్టాడిన్ తదితర మందులను వాడటం మంచిది. ఇలాంటి మందులను వాడటం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండదు. పాల దిగుబడి పెరుగుతుంది. పాడి గేదె పొదుగును పరిశుభ్రంగా ఉంచాలి. గోరువెచ్చని నీళ్లతో కడగాలి. పాడిగుడ్డతో మసాజ్ చేస్తే పాలు ఇవ్వడానికి ఇష్టపడుతుంది.

-డాక్టర్ పి. సురేష్, ఏడీ పశుసంవర్ధక శాఖ, తాడేపల్లిగూడెం

గిరిజనుల త్యాగమే పోలవరం

- పోడు భూములకు పట్టాలివ్వాలి
- సీపీఐ కార్యదర్శి నారాయణ



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ

బుట్టాయగూడెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలిచ్చి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కేఆర్ పురం ఐటీడీఏ వద్ద పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల త్యాగం వల్లే పోలవరం ప్రాజెక్టు వచ్చిందన్నారు. ప్రాజెక్టు కోసం భూములిచ్చిన గిరిజనులు అప్పులపాలు అవుతుంటే అమరావతికి భూములిచ్చిన రైతులు కోటీశ్వర్లు అవుతున్నారని తెలిపారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినందున నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని కేంద్రమే భరించాలని తెలియజేశారు. గుమ్మడిపల్లి పెదవాగు ప్రాజెక్టు పునర్నిర్మాణానికి తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. అటవీ హక్కుల చట్టాలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆరోపించారు. అనంతరం గిరిజనుల నుంచి అనేక సమస్యలపై స్వీకరించిన వినతులను పీవో కె.రాములు నాయక్‌కు అందజేశారు. నాయకులు డేగా ప్రభాకర్, ఎండీ మునీర్, మన్నవ కృష్ణచైతన్య, కారం దారయ్య, తలసాని రామారావు, చోడెం దుర్గ, బాడిస రాము, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

●ఛలో ఐటీడీఏ ముట్టడికి సీపీఐ పిలుపు నివ్వడంతో బుట్టాయగూడెం మండలంలో 144 సెక్షన్, 30 యాక్ట్ అమల్లో ఉన్నందున ధర్నా, ప్రదర్శన, ముట్టడికి అనుమతి లేదంటూ పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పోలీసులు ఐటీడీఏ కార్యాలయం గేట్లను మూసివేసి మోహరించారు. దీంతో శాంతియుతంగా నిరసన తెలిపి వినతులు అందించారు.

ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా షోలాపూర్ నుంచి అనకాపల్లి వరకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు విజయవాడ డివిజన్ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్ నంబర్ 01477 షోలాపూర్ నుంచి అనకాపల్లికి ఈ నెల 24వ తేదీ నుంచి ప్రతి శుక్రవారం నవంబరు 28వ తేదీ వరకూ నడుపుతున్నట్లు తెలిపారు. రైల్ నెంబర్ 01478 అనకాపల్లి నుంచి షోలాపూర్‌కు ప్రతి శనివారం ఈ నెల 25వ తేదీ నుంచి నవంబరు 29వ తేదీ వరకూ నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రెండు రైళ్ళు అక్కల్‌కోట్ రోడ్ దూర్దుహనీ, గంగాపూర్, కలబుర్గాయ్, వాడి, యాడ్గిర్, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్, అనంతపూర్, ధర్మవరం, కదిరి, మదనపల్లి రోడ్డు, పీలేరు, పాకాల, తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, నెల్లూరు, ఒంగోల్, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి స్టేషన్లలో ఈ రైలు ఆగనున్నట్లు తెలిపారు. ఈ రైళ్ళల్లో సెకండ్ క్లాస్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ క్లాసులు, జనరల్ సెకండ్ క్లాసు కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

వైసీపీతో విధ్వంసం.. కూటమితో సంక్షేమం

- మంత్రి రామానాయుడు
- రూ. 3.50 కోట్ల పనులకు శ్రీకారం



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గతంలో వైసీపీ పాలన అంతా విధ్వంసమేనని, నేడు కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం ఏక కాలంలో జరుగుతున్నాయని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం రూ.3.50 కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ముందుగా 24, 25 వార్డుల్లో రూ. 28.50 లక్షలతో మంచినీటి సరఫరా పైపులైన్ పనులు, 28వ వార్డు హనుమాన్ కాలనీలో రూ.14.38 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ, రూ.6లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, చంద్రాజీనగర్‌లో రూ.6.35 లక్షలతో, 31వ వార్డులో రూ.17.71 లక్షలతో, 10వ వార్డులో జి+1 కాలనీలో రూ.39లక్షలతో సీసీ రోడ్డు పనులు, హిందూ శ్మశాన వాటికలో రూ.17.50 లక్షలతో మెస్ నిర్మాణం, 2వ వార్డు బ్రాడీపేటలో రూ. 40 లక్షలతో తూర్పు కాపు కళ్యాణ మండపం పునః నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలనలో కక్షలు, వేధింపులు, హత్యలు వంటి రాక్షస పాలన సాగిందన్నారు. అందువల్లే ఆ పార్టీకి 11 సీట్లే దక్కి ప్రతిపక్ష హోదా కూడా లభించలేదన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, కర్నేన గౌరు నాయుడు, పెచ్చెట్టి బాబు, జీవీ, తులా రామలింగేశ్వరరావు, జక్కంపూడి కుమార్, కె. కొండ ప్రసాద్, శిడగం సూరి, దుగ్గిన రాము, రవి కుమార్, సీహెచ్. సత్యనారాయణ, పులి మాధవి, పొట్నూరి భవానీ, అప్పన్న, ఎస్తేరు రాణి, ఉన్నమట్ల కపర్ధి తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

తణుకు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కారణం ఏమిటో తెలియదు కానీ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. తేతలి గ్రామానికి చెందిన గరగ సాయి తేజ(19) సెల్ ఫోన్లు రిపేరు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వివాహం చేసుకుని పైడిపర్రుకు చెందిన శ్రీవల్లీని వివాహం చేసుకుని భార్యతో జీవిస్తున్నాడు. దీపావళి పండుగ సందర్భంగా భార్య శ్రీవల్లీ తన తల్లి ఇంటికి పైడిపర్రు, తల్లి తేతలి గ్రామంలోని వారి తల్లిదండ్రుల ఇంటికి వెళ్లడంతో ఒంటరిగా వున్న సాయి తేజ మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తల్లి గరగ లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు జిల్లా ఆసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె చంద్రశేఖర్ తెలిపారు.

ఎంఈవో కార్యాలయం అటెండర్ మృతి

భీమడోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని చికిత్స పొందుతూ ఎంఈవో కార్యాలయం అటెండర్ బాలిన రామకృష్ణ(42) బుధవారం మృతి చెందాడు.వేగివాడకు చెందిన రామకృష్ణ భీమడోలు మండలం విద్యాశాఖ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 15న విధినిర్వహణలో భాగంగా కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తుండగా భీమడోలు సాయిబాబా గుడి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలైన రామకృష్ణను ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. మృతుడు దివ్యాంగుడు కాగా భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్ట్ మృతి

ద్వారకాతిరుమల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్ట్ మృతిచెందాడు. ఏలూరుకు చెందిన కె.సునీల్ కుమార్(42) డెంటల్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం అతను తన సొంత పనులపై దూబచర్లకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సునీల్ కుమార్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

పాము కాటుకు మహిళ మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు ఒక మహిళ మృతి చెందింది. ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి గ్రామానికి చెందిన ముల్లంగి మంగాయమ్మ(56)ను ఈ నెల 21వ తేదీ రాత్రి పాముకాటు వేయడంతో ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వాచ్‌మన్ అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఒక హాస్టల్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన గంగుల బాబూరావు (62)నిడదవోలులోని హెబ్రోన్ హాస్టల్లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తాను ఈ బాధను భరించలేనని తాను బతకనంటూ మూడ్రోజుల క్రితం వారి బంధువులకు చెప్పినట్టు సమాచారం.మూడ్రోజుల క్రితం అదృశ్యమైన బాబూరావు ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి దగ్గరలో ఆటోనగర్ ఫేజ్ -1 జాతీయ రహదారి ప్రక్కన సర్వీసు రోడ్డు పక్కన పొదల్లో అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడు. అతని మెడపైన తాడుతో బిగించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ బి.నాగబాబు తన సిబ్బందితో బుధవారం ఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని బంధువులు బుధవారం రాత్రి ఏలూరు వచ్చి మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించి గుర్తించారు.

ఆత్మహత్య ఘటనపై ఆకివీడులో దుమారం

- స్నేహితులే విషం తాగించారంటూ బంధువుల ఆరోపణ
- పోలీస్ స్టేషన్ ముందు మృతదేహంతో ఆందోళన
- మార్కురాజే విషం తాగినట్టు వాంగ్మూలం ఇచ్చాడన్న పోలీసులు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

ఆకివీడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య ఘటన ఆకివీడులో తీవ్ర దుమారం రేపింది. ఏ కారణమో తెలియదు కానీ ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకోగా బంధువులు మాత్రం ఇది హత్యేనంటూ రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. గుమ్ములూరుకు చెందిన కొదమ మార్కురాజు(34) చినకాపవరంలో బేకరీ దుకాణం నడుపుతుంటాడు. వ్యాపారం నిమిత్తం ఆకివీడు వచ్చి దుకాణాల్లో సరుకులు తీసుకెళ్తుంటాడు. ఇదే తరహాలో గత నెల 19న దుకాణం బంద్ చేసి మోటారు సైకిల్‌పై ఆకివీడు వెళ్లాడు. రెండ్రోజులైనా మార్కురాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే అదే రోజున చొక్కా చిరిగి ఉండటంతో తామే ఆటో ఎక్కించి ఇంటికి పంపామని, తరువాత ఏం జరిగిందో తమకు తెలియదని స్నేహితులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే అప్పటి నుంచి గాలింపు చర్యలు చేపట్టిన బంధువులకు ఆచూకీ లభించకపోవడంతో గత నెల 24న పోలీసులకు తండ్రి విజయ కుమార్ ఫిర్యాదు చేశాడు. సెల్ నెంబర్ల ఆధారంగా ట్రేస్ చేస్తుంటే విజయవాడ, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ముంబాయి, విజయవాడ, హైదరాబాద్‌లో ఉన్నట్లు చూపిస్తుందని పోలీసులు బంధువులకు తెలిపారు. అయితే ఉన్నట్టుండి దాదాపు నెల తరువాత బుధవారం తెల్లవారు జామున ఆకివీడు లాంచీలరేవు మార్కెట్ దగ్గర మార్కురాజు గడ్డిమందు తాగి ఉండడం చూసిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు.హుటాహుటిన కుటుంబ సభ్యులు, పోలీసులు వచ్చి మార్కురాజును భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చూపించగా మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తీసుకెళ్లమని చెప్పారు. గుంటూరు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పెడన దగ్గర చనిపోవడంతో బంధువులు తిరిగి పోలీస్ స్టేషన్ దగ్గరకు తీసుకొచ్చి జాతీయ రహదారిపై మృతదేహాన్ని పెట్టి ఆందోళనకు దిగారు. సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ నాగరాజు బాధితులతో మాట్లాడినా వినిపించుకోకపోవడంతో రెండు గంటల తరువాత గుమ్ములూరు మాజీ సర్పంచ్ కోపల్లె సాయి వచ్చి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని భీమవరం పోస్టుమార్టం తీసుకెళ్లారు. ఏడుగురు స్నేహితులే మార్కురాజుకు గడ్డి మందు తాగించి ఉంటారంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు.అయితే మార్కురాజు గడ్డిమందు తానే తాగానని తమకు చెప్పాడని, వీడియో కూడా ఉందని పోలీసులు చెబుతున్నారు. మార్కురాజు తండ్రి విజయకుమార్ ఫిర్యాదుతో ఎస్ఐ హనుమంతు నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే మార్కురాజుకు పెళ్లి కాలేదు, తల్లిదండ్రులు ఉన్నారు.



మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు



మార్కురాజు (ఫైల్)

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై పని చేస్తున్న ఒక యువకుడికి షాక్ తగలడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. మండవల్లి మండలం మండవల్లికి చెందిన చిగురుపాటి సుకుమార్(24) బుధవారం మధ్యాహ్నం ఆ గ్రామంలో విద్యుత్ స్తంభంపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌నకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు.

ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి మూడు గేదెలు మృతి..

చింతలపూడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండలం వెలగపల్లి గ్రామ సమీపంలోని మొక్కజొన్న ఫ్యాక్టరీ వద్ద బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి గోలి సత్యనారాయణరెడ్డి అనే రైతుకు చెందిన మూడు పాడి గేదెలు మృతి చెందాయి. చేతికి అందే అంత ఎత్తులోనే ఈ ట్రాన్స్‌ఫార్మర్ బిగించి చుట్టూ రక్షణ నిమిత్తం ఎలాంటి కంచె వేయలేదు. దీంతో పశువులకు తీగలు తగిలి మృతి చెందాయని రైతు తెలిపారు. మూడు లక్షల రూపాయలు విలువైన గేదెలు చనిపోవడంతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదన చెందుతోంది.

చిట్టీల వ్యాపారి ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):చిట్టీల వ్యాపారం చేస్తున్న ఒక వివాహితకు సకాలంలో సొమ్ము వసూలు కాక ఆర్థిక ఇబ్బందులకు గురైంది. దీంతో మనస్థాపానికి గురై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన గంగిరెడ్డి రాజేశ్వరి(28) కొంత కాలం నుంచి బంధువులు, స్నేహితుల సహకారంతో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తోంది. సమయానికి చిట్టీల సొమ్ము వసూలు కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురైంది. మనస్థాపానికి గురైన ఆమె బుధవారం ఉదయం పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్ర గాయాలపాలైన ఆమెను బంధువులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో తడికలపూడి పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు గాయాలు

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఒక సెక్యూర్టీ గార్డు విధులకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. టి.నర్సాపురానికి చెందిన షామకూరి బాలాజీ(35) ఫైర్ స్టేషన్ సమీపంలో ఒక ఏటీఎం సెంటర్‌కు సెక్యూర్టీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం తన గ్రామం నుంచి విధులకు వెళ్తుండగా ఏలూరు అమీనా పేట పోలీస్ స్కూల్ ఎదురుగా వెనుక నుంచి కారు వచ్చి ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు రిఫర్ చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గాయాలతో పడి ఉన్న ఒక వ్యక్తిని ఆటో డ్రైవర్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతానికి చెందిన శ్రీను(50) ఏలూరు మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ ఉంటాడు. ఈ నెల 21న గాయాలతో పడి ఉన్న అతడిని ఒక ఆటో డ్రైవర్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న శ్రీను బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడికి మతిస్థిమితం సరిగాలేక అదృశ్యమయ్యాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో ఏలూరు త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు మండలం దాసరిగూడెం గ్రామానికి చెందిన శౌంరి శేషు(20) ఏలూరు సమీపంలోని సత్రంపాడులో ఉన్న జ్ఞాపిక టీవీఎస్ షోరూమ్‌లో పని చేస్తున్నాడు. అతడికి కొంత కాలం నుంచి మతిస్థిమితం సరిగా ఉండడంలేదు. ఈనెల 10న షోరూమ్‌కు వెళ్తున్నాని చెప్పి ఏలూరు వచ్చి అదృశ్యమయ్యాడు. అతని కోసం గాలించినా ఆచూకీ కానరాకపోవడంతో చివరకు ఏలూరు త్రి టౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. సీఐ వి.కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మేలైన దిగుబడులకు కృషి చేయాలి

దెందులూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మేలైన పంటల దిగుబడికి యాజమాన్య విధానమే ప్రధానమని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రశాంత్, మోక్షజ్ఞ, సలీమ్, సతీశ్, భరత్ అన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశా విద్యార్థులు దెందులూరులో వరి పంటలను బుధవారం పరిశీలించారు. వరిపంట గింజ పాలుపోసుకునే దశలో ఉందని, ఈ దశలో అకాలవర్షంతో పంటకు నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పంటలు పరిశీలించి అకాల వర్షంతో కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐగా సుధాకర్



ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐగా సుధాకర్ ఉద్యోగ బాధ్యతలను బుధవారం చేపట్టారు. భీమడోలు ఎస్ఐగా పనిచేస్తున్న సుధాకర్‌ను ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతలు కాపాడతానని, అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు చేపడతామన్నారు.

కమిషన్ బకాయిలు చెల్లించాలని వినతి

ఏలూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):గత ఏడేళ్ల నుంచి రేషన్ డీలర్లకు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కమిషన్ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏలూరు జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు జేసీ అభిషేక్ గౌడను కలిసి వినతి పత్రం అందజేశారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజుల పాటి గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ గత 2015 నుంచి ఏలూరు జిల్లాలోని రేషన్ డీలర్లకు అంగన్‌వాడీ,మధ్యాహ్న భోజన పథకం కమీషన్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. డీలర్లకు కమిషన్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని అధికారులు గత ఏడాది నుంచి చెబుతూనే ఉన్నారని కానీ బకాయిలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి, ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, గౌరవ అధ్యక్షులు సీహెచ్ కృపారావు, శివ, వెంకట్రావు, సిరాజ్, ఆదిబాబు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యానికి డీఎస్పీ హామీపై హర్షం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగవరంలో నలుగురు యువకులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో బాలుడు బేతాళ నాగ చైతన్య చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే.. బాలుడు కోలుకునే వరకు నాణ్యమైన వైద్యం చేయిస్తామని డీఎస్పీ యు.రవిచంద్ర హామీ ఇవ్వడం పట్ల మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేశ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్రను కలిసి బాలుడు పరిస్థితిని రాజేశ్ వివరించారు. బాధితుడైన బాలుడికి న్యాయం చేయాలని డీఎస్పీకి విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు నల్లి రాజేశ్ తెలిపారు. మాల మహానాడు నాయకులు తొర్లపాటి శ్రీనివాస్, వెంకట రమణ, పాతూరి అంబేద్కర్, మధు, ఆదాము, పి.రమేశ్, జి.వినోద్, వెంపల రాజు, ఎం.కిశోర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

నిడమర్రు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సూచనల ప్రకారం మండలంలో ప్రజలకు ఆధార్ నమోదు, సవరణ నిమిత్తం 23 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విజయకుమారి తెలియజేశారు. గురువారం పెదనింద్రకొలను, మందలపర్రు, గ్రామాల్లో 24న నిడమర్రు, చిన నింద్రకొలను, 25న దేవరగోపవరం, భువ్వనపల్లి గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.అలాగే బావాయిపాలెం సాధన స్కూల్లో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం నిర్వహిస్తున్నట్టు సదుపాయాలు వినియోగించుకోవాలని ఉత్తర్వుల ద్వారా తెలియజేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగి కుటుంబానికి భరోసా

ఏలూరు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):భీమడోలు జంక్షన్‌లో ఈ నెల 15న రోడ్డు ప్రమాదానికి గురై, వారంరోజులుగా ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్ఎస్ఏ భీమడోలు మండల వనరుల కేంద్రం(ఎంఆర్సీ) మెసెంజర్ ఉద్యోగి జాలిన రామకృష్ణ మంగళవారం రాత్రి మరణించడం పట్ల సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచిన రామకృష్ణ మృతదేహాన్ని బుధవారం సందర్శించిన ఏపీసీ మాట్లాడుతూ ఉద్యోగి కుటుంబానికి ప్రభుత్వం నుంచి సకాలంలో నష్టపరిహారం అం దేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం నాయకుడు శ్రీనివాసరావు ఉన్నారు.

పెదనింద్రకొలను భీమేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే



నిడమర్రు అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో తొలిరోజు శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామున 5 గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తన ఇష్టదైవమైన పెదనింద్రకొలను భీమేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ మేకా వెంకట రమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధర్మరాజకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన నాయకులు వంగా రఘు, సొసైటీ చైర్మన్ కందులపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణ కేంద్రంలో రక్తదానం

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏలూరు సమీపంలోని సత్రంపాడులో ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. అక్కడ శిక్షణ పొందుతున్న యువతీ, యువకులు రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు.కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ రీజనల్ అధికారి శ్రీనివాస్ రక్తదానం చేసిన యువతీ యువకులను అభినందించారు. సంస్థ డైరెక్టర్ ఎం.ఫణికిషోర్ మాట్లాడుతూ తలసీమియా బాధితుల కోసం రక్తం సేకరించడం ఎంతో ఆనందదాయకమన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వీవీఎస్ శాస్త్రి, పీఆర్వో రమణ పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతికి విశేష పూజలు



ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలోని తొలి బుధవారం కావడంతో దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని సత్రంపాడు, పత్తేబాదల్లోని లక్ష్మీగణపతిస్వామి ఆలయాల వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రెండుచింతల రాఘవేంద్రశర్మ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం పండ్లు, కూరగాయలతో అలంకరించి భక్తజనానికి దర్శన మిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి సన్నిధిలో కార్తీక దీపాలను వెలిగించి ఆరాధించారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తు లకు తగు ఏర్పాట్లు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంతం కిటకిటలాడింది.

విశ్వనాథ ఆశ్రమంలో గోవర్ధన పూజ

చింతలపూడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వనాథ ఆశ్రమంలో దీపావళి తరువాత వచ్చే రెండవ రోజు కార్తీకమాసంలో గోవర్ధన పూజ చేస్తుంటారు. బుధవారం ఈ గోవర్ధనపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆశ్రమంలోని గోశాలలో ఉన్న గోవులను పలువురు భక్తులు వెళ్ళి గోవులను కడిగి పసుపు, కుంకుమలతో పూజలు జరిపి పండ్లు తినిపించారు. దీనిపై భూదేష్ అనే భక్తుడు మాట్లాడుతూ గోవులను మనం ప్రేమించడం మానవాళికి మంచిదన్నారు.

ఆలయాల్లో కార్తీక మాసం ప్రత్యేక పూజలు

లింగపాలెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభమవడంతో మండలంలోని పలు శివాలయాలు కార్తీకమాస శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులు, మహిళలు స్వామివారిని దర్శించుకుని శివాలయాలలో తెల్లవారు జాము నుంచే ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు అధికసంఖ్యలో తరలి రావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి.

జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం

(5వ పేజీ తరువాయి)

వర్షం కురిసింది. ఆలయ పరిసరాలు, లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. పెదపాడు మండలంలో పలు గ్రామాల్లో ఈదరు గాలులు, భారీ వర్షంతో పలుచోట్ల వరి పంట నేలకొరిగింది. మండలంలో 15,800 ఎకరాల్లో స్వర్ణ, 1318 వరి రకాలు పొట్ట, ఈత దశలో ఉన్నాయి. కైకలూరు మండలంలో భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. రహదారులు కాలవలను తలపించాయి. డ్రెయిన్లు పొంగిపొర్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కైకలూరు కరకట్ట శివారు ప్రాంతంలో రహదారి అధ్వానంగా ఉండడంతో రెండు అడుగుల మేర నీరు నిలబడి ప్రజల రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. జాతీయ రహదారి విస్తరణ పనులు నిర్వహించడంతో భారీ వర్షానికి గోతుల్లో భారీగా వర్షపునీరు చేరి రోడ్డు కాలువను తలపిస్తుంది. మండలంలోని శింగాపురం వద్ద ఎన్‌హెచ్ ఒక వైపు పనులు పూర్తిచేసి మరోవైపు మధ్యలో నిలిపివేయడంతో ఆ ప్రాంతంలో ప్రయాణించాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అదుపు తప్పితే గోతులో పడే ప్రమాదముందని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. చేపలు, రొయ్యల చెరువుల్లో భారీగా వర్షపునీరు చేరడంతో రైతులు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి నీటిని బయటకు తరలించారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



ఆర్డీవోతో రీసర్వేపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్

మహిళలు ఆర్థికంగా రాణించాలి

ద్వారకాతిరుమల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించి తద్వారా తమ కుటుంబాలను ఉన్నత స్థితిలో నిలపాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ద్వారకాతిరుమలలోని బంగారుతల్లి కల్యాణ మండపం ఆవరణలో బుధవారం జరిగిన మండల సమాఖ్య సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జీఎస్టీ తగ్గింపునకు శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు మహిళలు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలను ఉన్నత స్థానంలో నిలబెట్టిన ఘనత సీఎం చంద్రబాబుకు మాత్రమే దక్కుతుందన్నారు. మహిళలకు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. నేతలు లంకా సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీ రమణి, సొసైటీ చైర్మన్లు రేగంటి రాంబాబు, అద్దంకి రామచంద్రశేఖర్, డీవీఎస్ చౌదరి, ఏపూరి దాలయ్య, మటపర్తి బద్రి, సర్పంచ్ స్వర్ణలత, జడ్పీటీసీ శామ్యూల్, పాకనాటి శేషు, ఏపూరి కిశోర్ పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీసర్వే: చింతమనేని

పెదవేగి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే పారదర్శకంగా జరగాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల పంచాయతీ కార్యాలయంలో ఆర్డీవో అచ్యుత్ అంబరీష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రభాకర్ భూముల రీసర్వే జరుగుతున్న విధానంపై సమీక్షించారు. ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో జరిగిన అస్తవ్యస్త విధానాలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం నుంచి ప్రజలు బయపడుతున్నారని, భూముల రీసర్వే సక్రమంగా లోపరహితంగా జరిగేలా చూడాలని ఆయన సూచించారు. తహసీల్దారు ఎస్డీ.భ్రమరాంబ, సర్పంచ్ గుంజా క్రీస్తుమణి మధుబాబు, దెందులూరు ఏఎంసీ చైర్‌పర్సన్ గారపాటి రామసీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పార్టీ సమన్వయ కమిటీ సమావేశం..

దుగ్గిరాల కార్యాలయంలో పార్టీ సమన్వయ కమిటీ సమావేశం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసి, ప్రజల అభిమానాన్ని పొందగలిగామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలపై అసభ్య పోస్టులు పెడితే చూస్తూ ఊరుకోబోమని, కఠినచర్యలు తప్పవన్నారు. వైసీపీ చేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పికొట్టి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని ఆయన నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఏఎంసీ చైర్ పర్సన్ గారపాటి రామసీత, నాయకులు తాతా సత్యనారాయణ, మోరు శ్రావణి దశరథ్, గుత్తా అనిల్, కమ్మ శివరామకృష్ణ, మంచినేని శ్రీనివాసరావు, పామర్తి నాగభూషణం, పరసా వెంకట్రావు, కొనకళ్ల శివమణి, నేతల రవి, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రోషన్ శంకుస్థాపనలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పుట్లగట్లగూడెంలో రూ.10 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం జలజీవన్ మిషన్ నిధులు రూ.20 లక్షలతో బోరు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మైసన్నగూడెంలో జడ్పీ నిధులు రూ.20 లక్షలు, ఉపాధి నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, ఎలికే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు డివిజన్‌లో కలపాలి..

చింతలపూడి, లింగపాలెం మండలాలను ఏలూరు రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయాలని స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతోపాటు నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి పత్రం అందజేశారు.

నీటి కాలుష్యంపై ఎమ్మెల్యే బాలరాజు పరిశీలన

జీలుగుమిల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట సమీప పేపర్ కర్మాగారం ద్వారా ఆంధ్రాలోకి వస్తున్న వ్యర్థాల వల్ల చెరువులు, వాగులు కలుషితమవుతున్నాయని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. అశ్వారావుపేట వాగు వద్ద వచ్చే వ్యర్థాలను బుధవారం ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కె.వెంకటేశ్వరావుతో కలిసి క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే పరిశీలించారు. సమీప చెరువులో కలుషిత వ్యర్థాలతో జలచరాలు, ప్రాంతంలో నీటిని తాగటం వల్ల కొన్ని రకాల పక్షిజాతులు అంతరించిపోతున్నాయన్నారు. సమీప రైతుల ఫిర్యాదుతో పరిశీలించారు. ప్రజారోగ్యం రైతుల పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని సమస్యపై ఉన్నతాధికారుల ద్వారా విచారణ జరిపి నివేదికను ప్రభుత్వానికి పం పాలన్నారు. కాలుష్య నియంత్రణ శాఖ ఏలూరు ఏఈ ఎస్.రమేశ్ ఉన్నారు.

పెండింగ్ జీతాలు ఇప్పించండి

ఏలూరు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని ఏరియా కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్స్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే పారిశుద్య కార్మికులకు పెండింగ్ జీతాలు ఇప్పించాలని రాష్ట్ర డైరెక్టర్ సెకండరీ హెల్త్ కమీషనర్ చక్రధరబాబును కోరుతూ ఏపీ మెడికల్ అండ్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ నాయకులు వినతిపత్రాన్ని బుధవారం అందించారు. ఆ యూనియన్ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, జిల్లా కార్యదర్శి వి.దత్తాత్రేయ(దత్తు), ఏలూరు బ్రాంచ్ అధ్యక్షురాలు పి.విజయ, సూపర్‌వైజర్ అజయ్ కలిసి కమిషనర్‌కు సమస్యలు విన్నవించారు. ఏలూరు జిల్లాలో ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు తీరని నష్టం వాటిల్లిందని ఆ నష్టాన్ని కాంట్రాక్టుల ద్వారా భర్తీ చేయించాలని కోరారు. జీతాలు చెల్లించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు.



విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా కొమరం భీమ్ జయంతి

జీలుగుమిల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లిలో కొమరం భీమ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. భీమ్ జయంతి పురస్కరించుకుని గిరిజన సంఘాల నాయకులు జాతికి ఆయన చేసిన కృషిని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గుర్తు చేశారు. విగ్రహదాత జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవి కుమార్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వరావు, కొమరం భీం యూత్ చిర్రి శ్రీను, చిర్రి వెంకటేశ్వరావు, పద్దం వెంకటకృష్ణ పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీమ్ జయంతి వేడుకలను బుధవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కోయ అంకంపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఏఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణం రాజు కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

● ఉంగుటూరు: ఆదివాసీల జీవన గతి మార్చిన కొమరం భీమ్‌కు బుధవారం నారాయణపురం శ్రీఅరవింద ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర, రాజనీతి శాస్త్రం అధ్యాపకులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. అలాగే సమాజంలో కుల వివక్ష ఎదుర్కొంటున్న దళితుల ఆత్మగౌరవానికి కృషి చేసిన మాజీ ఐఏఎస్ ఎస్.ఆర్.శంకరన్ జయంతి వేడుకలు నిర్వహించారు. శంకరన్ వివాహం చేసుకోకుండా పేదల కోసం ఎన్నో త్యాగాలు చేశారు. ఈ వేడుకలలో డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ రెడ్డియ్య, కొండా రవి, నిర్మలజ్యోతి, మసీంద్రరావు, రామ్మోహనరావు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న సీడీపీవో సరళ

శిశువిహార్ నిర్వహణపై సీడీపీవో ఫైర్

పోలవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పోలవరం మండల కేంద్రంలో విద్యాశాఖ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న సిరివెన్నెల శిశు విహార్‌ని సీడీపీవో కె.సరళ బుధవారం తనిఖీలు నిర్వహించారు. విద్యాశాఖ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న 3 నుంచి ఐదేళ్ల లోపు శిశువులతో ట్యూషన్ సెంటర్ పేరిట విద్యాసంస్థ నిర్వహించడం పట్ల ఆమె మండిపడ్డారు. అంగన్వాడీల్లో పౌష్టికాహారం, ఆరోగ్య భద్రతల మధ్య ఎదగాల్సిన శిశువులను నిర్బంధంగా 9 గంటల పాటు స్త్రీశిశు సంక్షేమ శాఖ పరిధిలో అనుమతులు లేకుండా ట్యూషన్ నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు విద్యాసంస్థను అధికారికంగా అనుమతులు లేవని మూయించినా నిరంతర ట్యూషన్ సెంటర్ పేరిట నిర్వహణ కొనసాగించడం తగదన్నారు. అనంతరం పట్టిసీమ, జగన్నాథపేట, దేవరగొంది, బెస్తవీధి, నూతన గూడెం అంగన్వాడీలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ నాయకుల పరామర్శలు

కామవరపుకోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అంకాలంపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బొప్పన మురళీకృష్ణ, వీరంపాలెం గ్రామానికి చెందిన బూత్ కన్వీనర్ కట్టా ఆనంద్ మాతృమూర్తి శ్రీనివాసమ్మ, వడ్లపల్లి గ్రామానికి చెందిన గంజి ఉషారాణి ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాలను నాయకులు పరామర్శించారు. సొసైటీ చైర్మన్ ఘంటా మాధరావు, కూటమి నాయకులు కిలారు సత్యనారాయణ, గంజి సుబ్బారావు, మానికల ప్రసాద్, బొప్పన వీర శేఖరరావు, దాసి యేసురత్నం, కె.సాల్మన్‌రాజు బుధవారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. అలాగే తడికలపూడి గ్రామానికి చెందిన జనసేన నాయకులు మేరుగ ప్రేమ శివకుమార్ ఈ నెల 13న అనారోగ్యంతో మృతి చెందగా పెద్ద కార్యాన్ని వీరిశెట్టిగూడెం అడ్డరోడ్డు వద్ద బుధవారం నిర్వహించగా కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చి నివాళులర్పించారు.



సంతకాలు సేకరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

ఏలూరుకార్పొరేషన్,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వాసుపత్రి నుంచి సంతకాలు సేకరించి ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య తొలి సంతకాన్ని చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పీపీపీ విధానంపై తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ పెట్టుబడితో నిర్మించిన మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఎం నాయకులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, పిల్లి రామకృష్ణ, పంపన రవికుమార్, ఎ.శ్యామలారాణి, పిచ్చుక ఆదిశేషు, ఎం.ఇస్సాకు, ఎ.గోపి, వై.ఎస్.కనకారావు, జి.రవికుమార్, ఆర్.అరుణకుమారి, బోడెం శ్రీను, జి.కోటేశ్వరరావు, కట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పొర్లు ఉత్సవం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాములు బుధవారం స్థానిక బాలాజీ థియేటర్ సమీపంలోని రైస్‌మిల్లు ఆవరణలో అన్నదానోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములకు నిత్య భిక్ష ప్రక్రియలో భాగంగా గురుస్వాములు పొర్లు ఉత్సవాన్ని నిర్వహించారు. స్వాములు భిక్ష చేసిన అనంతరం వారి ఆకులను ఆవరణలో పరిచి ఆ ఎంగిలాకులపై గురుస్వాములు పొర్లుకుంటూ అయ్యప్ప స్వామి గీతాలను ఆలపిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.

'సురక్ష'తో నకిలీ మద్యానికి చెక్

చింతలపూడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సురక్ష యాప్ తీసుకొచ్చిందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఈ యాప్ గురించి వివరిస్తూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన జంగారెడ్డిగూడెంలో 27 మంది మరణించారన్నారు. ప్రస్తుతం మద్యం బాటిల్‌పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే మద్యం బాటిల్ ఎక్కడ తయారైంది, దానిలో ఏమేమి ఉన్నాయి, ధరతో అన్ని వివరాలు వస్తాయన్నారు. కూటమి నాయకులు మాటూరి వెంకట్రామయ్య గుత్తా వెంకటేశ్వరరావు, అట్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధా నాల వల్లే రాష్ట్రంలో రైతాంగ ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, కనీస మద్దతు ధరలు ఇప్పటికైనా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం అన్నేభవనంలో జరిగిన రైతు సంఘ సమావేశానికి జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. రైతాంగం ఎదుర్కొం టున్న సమస్యలపై చర్చలు జరిపారు.ఈ నెల 30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామనిరైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఈ సందర్భంగా ప్రకటించారు. సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు రైతుల ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. సిరిబత్తుల సీతారామయ్య, బొడ్డు రాంబాబు హాజరయ్యారు.

కృత్రిమ మేధస్సుతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

» రిసోర్స్ పర్సన్ గంటా సుబ్బారావు



పెదపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సు(ఏఐ)తో విద్యా రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఎండీ, రిసోర్స్ పర్సన్ గంటా సుబ్బారావు అన్నారు. పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కృతిమ మేధస్సు టూల్స్ అనే అంశంపై అధ్యాపక అభివృద్ధి(ఎఫ్‌డీపీ)కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గంటా సుబ్బారావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకుని బోధనలో వినియోగిస్తే విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, విశ్లేషణా నైపుణ్యాలు మరింత సమర్థవంతంగా, సముచితంగా మారతాయన్నారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ ఏఐ ఆధారిత బోధనా పద్ధతులు విద్యా ర్థుల్లో కొత్త ఆలోచనలకు దారి తీస్తాయన్నారు. జాయింట్ సెక్రటరీ వంకినేని భానుప్రకాష్, జాస్తి మల్లికార్జునుడు, కె.హరిరామకృష్ణరాజు, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణ

పెదపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులకు బ్యూటీపార్లర్‌పై ఉచితంగా 35 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎం.ఫణికిశోర్ తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శిక్షణకు 10వ తరగతి ఆపై విద్యార్హత గల గ్రామీణ ప్రాంతానికి చెందిన 19-45 సంవత్సరాల మధ్య మహిళలు అర్హులని, వీరికి శిక్షణ కాలంలో శిక్షణతో పాటుగా ఉచితంగా భోజనం, వసతి కల్పిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 95027 23561, 90140 40780 నెంబర్లలో కానీ, వట్లూరు టీటీడీసీ పక్కన ఉన్న శిక్షణ కేంద్రం వద్ద గాని తెలుసుకోవాలని ఫణి కిశోర్ చెప్పారు.



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

సీపీఆర్‌తో ప్రాణ రక్షణ

దెందులూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దెందులూరులోని నర్సింగ్ స్కూల్లో సీపీఆర్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థి మంగరాణి మాట్లాడుతూ గుండె నొప్పి వస్తే తొలుత సీపీఆర్ చేయాలన్నారు. సీపీఆర్ అంటే కార్డియో పల్మనరీ రిససిటేషన్ అని తెలిపారు. గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు, లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోని స్థితిలో ఉన్నప్పుడు వెంటనే అత్యవసర సీపీఆర్ ప్రక్రియ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ చర్య ద్వారా గుండెపోటు బారిన పడిన వ్యక్తులను ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చన్నారు. గుండెపై ఒత్తిడి చేయడం ద్వారా గుండెపోటునుంచి వ్యక్తిని కాపాడవచ్చన్నారు.

నేత్ర సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ఏలూరురూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కంటి వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే చూపు పోయే ప్రమాదం ఉందని రవికిరణ్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణురాలు హేమలత అన్నారు. శనివారపుపేట జడ్పీ హైస్కూల్లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ హేమలత విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు దీర్ఘదృష్టి, హ్రస్వ దృష్టి లోపం ఉంటే కళ్లజోడు తప్పనిసరిగా వాడాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శిశువులకు టీకాలు


భీమడోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలం పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎం.ఎం.పురం గ్రామంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరిగింది. ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మణరావు కార్యక్రమాన్ని పరిశీలించి టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. శిశువు తల్లి ఆరోగ్య పరిరక్షణకు టీకాలు దివ్య ఔషధాలని పేర్కొన్నారు. ఆరోగ్య కార్యకర్త, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై అవగాహన

భీమడోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలం పాతూరు పాఠశాలలో గ్రామ బాలల సంక్షేమ సంరక్షణ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం రఘురామరాజు పాల్గొని బాలల హక్కులు, సంరక్షణ, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ అంశాలను వివరించారు. ఉపాధ్యాయులు ఎంసుధాకర్, అమరావతి పాల్గొన్నారు.

చింతలపూడి ఐటీఐలో ఏటీవో పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ ఫిట్టర్ పోస్టు ఖాళీగా ఉందని ప్రిన్సిపల్ కృష్ణ మోహన్ తెలిపారు. ఐటీఐ, బీటెక్ మెకానికల్, డిప్లమో మెకానికల్, ఇంజనీరింగ్ మ్యాథ్స్ పూర్తి చేసిన వారు అర్హులని, ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పూర్తి చేసిన దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. కాంట్రాక్టు పద్ధతిలో నెలకు 14 వేలు జీతం ఐఎంసీ ఇస్తుందని, ప్రతిభను బట్టి ఏడాదికి ఇంక్రిమెంట్ ఉంటుందని తెలిపారు.



కోటగిరి శ్రీధర్ జన్మదినోత్సవం

కామవరపుకోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం తడికలపూడిలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు బర్త్‌డే కేక్‌ను కట్ చేసి వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కడిమి రమేశ్, తడికలపూడి సర్పంచ్ కొత్తపల్లి రజనీశ్రీనివాస్, నాయకులు గంగుల కడియాలు,కొప్పర్తి లక్ష్మీనాగేంద్ర, కోలా విష్ణుమూర్తి, గంగుల కాశీ, గంగుల వెంకట్రావు, పెరవలి రాజు, ముళ్ళపూడి నాగరాజు, కొండపల్లి ధర్మరాజు, చలమాల సుబ్బారావు, అన్నపురెడ్డి రాంబాబు, మద్దుల ఆశీర్వాదం, బోట్ల రఘుకిషోర్ పాల్గొన్నారు.

నేడు చాట్రాయికి మంత్రి పార్థసారథి

చాట్రాయి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం సాయంత్రం 4 గంటలకు చాట్రాయి సచివాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

నూజివీడు డివిజన్‌లో విస్తారంగా వర్షాలు

నూజివీడు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో నూజివీడు డివిజన్ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు నమోదు అవుతున్నాయి. గత 24 గంటల్లో నూజివీడు మండల పరిధిలో 3.2 మిల్లీమీటర్లు, చాట్రాయిలో 2.6, ఆగిరిపల్లిలో 6.8, ముసునూరులో 9.4, చింతలపూడి 7.2, లింగపాలెంలో 5.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బలివే ఉత్సవాలు విజయవంతం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో

ముసునూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలపై బుధవారం వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ బుధవారం నుంచి వచ్చే నెల 20 వరకు జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులను కోరారు. తమ్మిలేరులో వాటర్ లెవల్‌ను ఎప్పటికప్పుడూ పరిశీలించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని, స్నాన ఘాట్ల వద్ద పోలీస్ బందోబస్తు ఉంచాలని, పారిశుధ్యం మెరుగుకు పంచాయతీ అధికారులు సహకరించాలని, ఆలయ ప్రాంగణంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఈవో సంబంధిత అధికారులను కోరారు. ఆలయ మాజీ చైర్మన్ మానం గంటేశ్వరరావు, ధర్మకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి తపనా చౌదరి చేయూత



చాట్రాయి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ శివారు కరుణాపురానికి చెందిన పిల్లి ప్రకాశ రావు (45) కిడ్నీ సమస్యతో విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపనా చౌదరి) రూ. 20 వేల సాయాన్ని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా నాయకుడు బుర్రి శ్రీకర్ ద్వారా మృతుని కుటుంబానికి అందజేశారు. టీడీపీ నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, నక్కా రాము పాల్గొన్నారు.

పీఏసీఎస్ సభ్యురాలి కుటుంబానికి సాయం



చాట్రాయి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం పీఏసీఎస్ సభ్యురాలు, రైతు చల్లగుళ్ళ పద్మావతి ఇటీవల మృతి చెందడంతో పీఏసీఎస్ తరపున బుధవారం చైర్మన్ యర్రా ప్రసాదరావు రూ. 10 వేలు సాయాన్ని మృతురాలి భర్త శ్రీనివాసరావుకు అందజేశారు. కూటమి నాయకులు వెల్ది నాగేశ్వరరావు, మలగలపల్లి సుబ్రహ్మణ్యం, చల్లగుళ్ళ రాజారత్నం, విజయశేఖర్, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు నేరవేర్చాలి : డీఎల్‌పీవో



ముసునూరు, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ లక్ష్యాలను నేరవేర్చేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని నూజివీడు డీఎల్‌పీవో, మండల ప్రత్యేక అధికారి సుందరి అన్నారు. బుధవారం ముసునూరులో సంపద కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే స్వచ్ఛభారత్‌లో భాగంగా మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఎంపీడీవో పిల్లి ఏసుబాబు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలను గౌరవించాలి : సీఐ



నూజివీడు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నూజివీడు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ నూజివీడులోని పలు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భవిష్యత్ పౌరులుగా విద్యార్థులు చట్టాలను గౌరవించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ఈ సందర్భంగా పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. పట్టణ ఎస్‌ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు లోకుమూడి విద్యార్థినులు



మండవల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలం లోని లోకుమూడి జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు బాలికలు అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 21న గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని హెచ్ఎం పి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన బాలికలను, వ్యాయమ ఉపాధ్యాయుడిని ఎంఈఓలు సురేష్, రత్నసునాదం, ఎస్ఎంసీ చైర్మన్ సుజాత, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



కైకలూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చిన జీయర్ స్వామి పుట్టినరోజు సందర్భంగా పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బుధవారం కైకలూరుకు చెందిన సమయమంతుల గోవర్ధనరావు, చైతన్య రాజ్యలక్ష్మీ దంపతులు ఇంటివద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి వికాస తరంగిణీ అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో లలితా సహస్ర నామ పారాయణాన్ని నిర్వహించారు. అనంతరం కైకలూరు పంచాయతీ పారిశుధ్య కార్మికులు 80 మందికి దుప్పట్లును దంపతులు అందజేశారు.

పాఠశాల వద్ద మురుగునీరు తొలగింపు

కలిదిండి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కలిదిండి ఇందిరా కాలనీ 14వ వార్డులో ప్రాథమిక పాఠశాల వద్ద రహదారిపై నిల్వ ఉన్న మురుగు నీటిని ఎంఈవో శ్రీనివాస్, పంచాయతీ అధికారులు తొలగించారు. రహదారిపై మురుగునీరు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ధర్నా చేయటంతో అధికారులు స్పందించారు. రహదారిపై నిల్వ ఉన్న నీరును మోటారుతో బయటకు తోడారు. బ్లీచింగ్ చల్లారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	


పెదగొన్నూరు వద్ద ఈడేపల్లిలో డ్రెయిన్‌లో పేరుకున్న గుర్రపు డెక్క

డ్రెయిన్ ఉన్నట్టా! లేనట్టా?

» కుంచించుకుపోతున్న ఈడేపల్లి డ్రెయిన్ » రైతులకు ముంపు బెడద

ముదినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల పంట భూములకు మురుగునీటి పారుదల సౌకర్యం కల్పించాల్సిన ఈడేపల్లి మైనర్ డ్రెయిన్ రోజు రోజుకీ కనుమరుగైపోతున్నది. పలు చోట్ల ఈ డ్రెయిన్ వుందా? లేదా అన్నట్లుగా ఆక్రమణలకు గురికావటమే కాక, గుర్రపు డెక్క, జమ్ముతో మూసుకుపోయింది. సింగ రాయపాలెం, పెదగొన్నూరు, ఈడేపల్లి, విశ్వనాద్రిపాలెం, కొరగుంటపాలెం, అల్లూరు గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల పంట భూములు ఈ మైనర్ డ్రెయిన్ అధ్వాన్న స్థితి వల్ల చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతున్నాయి. సార్వా వరి పంట సక్రమంగా రైతుల చేతికి దక్కటం లేదు. డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు, జమ్మును తొలగించేందుకు డ్రెయినేజీ శాఖ నిధులు మంజూరు చేయటం లేదు. సుమారు 12 కిలోమీటర్ల పొడవు కలిగిన ఈ డ్రెయిన్ 70 శాతం ఇసుక మేట వేసుకుపోయింది. చేపల చెరువుల తవ్వకం వల్ల ఆక్రమణలకు గురైంది. ఈడేపల్లి గ్రామం పొడవునా ఈ డ్రెయిన్ చిన్న కాల్వలా మారింది. డ్రెయిన్‌లోని డెక్క, జమ్ము తొలగించాలని రైతులు కోరుతున్నారు.


సానారుద్రవరంలో పంట పొలాల్లోకి చేరిన వరద నీరు

పొంగిన లాల్వ డ్రెయిన్

» ముంపులో వరి పొలాలు

కలిదిండి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో లాల్వ డ్రెయిన్ పొంగుతోంది. దీంతో ఎగువన ఉన్న వెంకటాపురం, సానారుద్రవరం, గోపాలపురం గ్రామాల్లో వరి పొలాలు ముంపు బారిన పడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కలిదిండి - కైకలూరు రహదారిలో ఐదేళ్ల క్రితం లాల్వ డ్రెయిన్‌పై వంతెన కూలిపోవటంతో అధికారులు తూములు అమర్చి తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తూములు మట్టితో పూడిపోవటంతో ఎగువ నుంచి వచ్చే వరద నీరు దిగువన ఉన్న ఉప్పుటేరులోకి ప్రవహించటం లేదు. దీంతో లాల్వ డ్రెయిన్‌లో నీరు వెనక్కి ఎగదన్ని పొంగటంతో వరి పొలాల్లోకి నీరు ప్రవహించటంతో పొలాలు మునిగి పోతున్నాయని రైతులు వాపోతున్నారు. కలిదిండి పట్టణంలో మురుగునీరు డ్రెయినేజీ ద్వారా లాల్వ డ్రెయిన్‌లోకి పారటం లేదు. దీంతో అంతర్గత రహదారులు నీట మునిగాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లాల్వ డ్రెయిన్‌లో ఏర్పాటు చేసిన తూముల్లో పూడిక తొలగించి శాశ్వత రహదారిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కైకలూరు కరకట్ట శివారులో నీటమునిగిన రహదారి


శింగాపురంలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తవ్విన గోతుల్లో నిలిచిన వర్షపు నీరు


ముదినేపల్లి - గుడ్లవల్లేరు రోడ్డులో భారీ వర్షానికి నిలిచిన నీరు

భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం

రహదారులు జలమయం కావడంతో ప్రజల ఇక్కట్లు

ముదినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి: భారీ వర్షాలకు ముదినేపల్లి - గుడ్లవల్లేరు ప్రధాన ఆర్ అండ్ బీ రోడ్డు జలమయమైంది. ముదినేపల్లి పంచాయతీ పరిధిలో గోతుల్లో నిలిచిన నీరు బయటకిపోయే మార్గం లేక పోవడం, రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రెయిన్లు కూడా వర్షాలకు పొంగటంతో రోడ్డుపై నీరు కదలటం లేదు. ముదినేపల్లి శివారు అన్నవరంలోని జగనన్న కాలనీ జలమయమైంది. పేరూరు, వాడవల్లి, వణుదుర్రు, ముదినేపల్లి అంబేడ్కర్ కాలనీలో కూడ వర్షపు నీరు నిలిచి ఉంది.

మండవల్లి: మండలంలో బుధవారం ఉదయం నుంచి వర్షం పడు తోంది. రోడ్లపై జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమ య్యాయి. చేపల, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడుతుందేమోనని ఆక్వా రైతులు ఆందోళన ఉన్నారు.

జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం

(5వ పేజీ తరువాయి)

వర్షం కురిసింది. ఆలయ పరిసరాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెదపాడు మండలంలో పలు గ్రామాల్లో ఈదరు గాలులు, భారీ వర్షంతో పలుచోట్ల వరి పంట నేలకొరిగింది. మండలంలో 15,800 ఎకరాల్లో స్వర్ణ, 1318 వరి రకాలు పొట్ట, ఈత దశలో ఉన్నాయి. కైకలూరు మండలంలో భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. రహదారులు కాలవలను తలపించాయి. డ్రెయిన్లు పొంగిపొర్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కైకలూరు కరకట్ట శివారు ప్రాంతంలో రహదారి అధ్వానంగా ఉండడంతో రెండు అడుగుల మేర నీరు నిలబడి ప్రజల రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. జాతీయ రహదారి విస్తరణ పనులు నిర్వహించడంతో భారీ వర్షానికి గోతుల్లో భారీగా వర్షపునీరు చేరి రోడ్డు కాలువను తలపిస్తోంది. మండలంలోని శింగాపురం వద్ద ఎన్‌హెచ్ ఒక వైపు పనులు పూర్తి చేసి మరోవైపు నిలిపివేయడంతో ఆ ప్రాంతంలో ప్రయాణించాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అదుపు తప్పితే గోతులో పడే ప్రమాదముందని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. చేపలు, రొయ్యల చెరువుల్లో భారీగా వర్షపునీరు చేరడంతో రైతులు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి నీటిని బయటకు తరలించారు.


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య పరీక్షలు

ఆగిరిపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ స్కూల్లో శ్రీభాగ్యలక్ష్మీ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులకు కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 450 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 18 మంది విద్యార్థులకు కళ్ళజోళ్ళు అవసరాన్ని గుర్తించామని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు పాలడుగు వెంకట శ్రీనివాసరావు తెలిపారు. టి. భాస్కరరావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఆంజనేయులు మండల విద్యాశాఖ అధికారులు శిలారపు హేబేలు, కొవ్వలి ఆనంద్ కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని పి. పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


అల్లూరు సోమేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు.. కోరుకొల్లులో శివమాలధారుల కార్తీక పూజలు

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

ముదినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో కార్తీక మాస ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువ జామునే మహిళలు ఆలయాల్లో దీపారాధనలు చేసి పూజలు జరిపారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలోని అల్లూరు శ్రీ పార్వతీ సమేత సోమేశ్వర స్వామి దేవస్థానంలో ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకుడు ఐలూరి సుబ్బరాయ శర్మ స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆకాశ దీపారాధన ప్రారంభించారు. గురజ, పెదగొన్నూరు, సింగరాయపాలెం, వడాలి, పెదపాలపర్రు, కోడూరు శివాలయాల్లో కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలతో పూజలు నిర్వహించారు.

కలిదిండి: మండలంలోని శివాలయాల్లో కార్తీక పూజలు బుధవారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. కలిదిండిలో దక్షిణ కాశీగా పేరొందిన పాతాళ భోగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కోరుకొల్లు సోమేశ్వరస్వామి ఆలయంలో శివమాలధారులు పూజలు చేశారు. అర్చకులు ఆకాశ దీపాన్ని వెలిగించి పూజలు ప్రారంభించారు. పెదలంక నాగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు నాగేంద్ర శర్మ పూజలు నిర్వహించారు.

రూప్‌చంద్ ధర ఢమాల్!

కనిష్ఠ స్థాయికి ధర.. కేజీ రూ.80

» మేతలు, లీజులు కూడా రాని చేపల సాగు » కేజీకి రూ.35 వరకు నష్టం

» చేపల మేత పంపిణీకి వెనుకాడుతున్న ఫీడ్ కంపెనీలు

» సొమ్ము కడితేనే చేపల మేత దిగుమతి » అక్కరకు రాని చేపల సాగు



కోస్తా తీర ప్రాంతంలో చేపల సాగులో ప్రధానంగా రూప్‌చంద్ ధర అత్యంత కనిష్ఠ స్థాయికి చేరుకుంది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ ఈ ధర పలకలేదు. దీంతో రూప్‌చంద్ సాగు చేసే రైతులు తీవ్రనష్టాలలో కూరుకుపోతున్నారు. సాగు కష్టమవుతోందని, కనీసం మేతలు, లీజులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. చేపల మేత అందించే ఫీడ్ కంపెనీలు సొమ్ము కడితేనే అందిస్తామని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- నిడమర్రు అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

కనిష్ట స్థాయికి రూప్‌చంద్ ధర

ఈ సంవత్సరం జూన్ చివర నుంచి రూప్‌చంద్ ధర పతనం కావడం ప్రారంభమైంది. రైతు వద్ద రూ.114- 115 పలికిన చేప ధర పతనమ వుతూ ప్రస్తుతం గత ఐదేళ్లలో కనిష్ట స్థాయి రూ.80కు దిగజారింది. ఇప్పుడున్న మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ ధర ఇంకా పతనమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇదే జరిగితే గోదావరి, కృష్ణా ఆయకట్టు ప్రాంతంలో ఇకమీదట చేపల చెరువుల జోలికి వెళ్లలేని పరిస్థితి దాపరిస్తుందని వాపోతున్నారు.

ఈ సంవత్సరం జూలై ప్రారంభం నుంచి రూప్‌చంద్ చేప ధర పతనం అవుతోంది. ముఖ్యంగా జూన్ 15న కేజీ రూప్‌చంద్ ధర రూ.114 ఉండగా ప్రస్తుతం అక్టోబరుకు రూ.80 కనిష్ట ధరకు చేరింది. ఒక కేజీకి సుమారు రూ.40 రైతు నష్టపోతున్నాడు. రైతుకు చేప పెంపకానికి కేజీకి రూ.95 నుంచి రూ.100 వరకు రైతుకు ఖర్చు అవుతుండగా లాభం లేకపోగా సుమారు రూ.15 కేజీకి నష్టపోతున్నాడు. ఒక లారీ పది టన్నుల సరుకు పడితే రైతుకు సుమారు రూ.1.5 లక్షలు నష్టం వస్తోంది. ఈవిధంగా ఉంటే రైతు పరిస్థితి ఏమి కావాలని ఆందోళన చెందుతున్నారు. కనీస పెట్టుబడులు రాకపోతే ఎలా అని ఆవేదన చెందుతున్నారు.

ధర పతనానికి కారణాలు..

- ఇటీవల ముగిసిన దసరా నవరాత్రులు, దీపావళి, ప్రస్తుత కార్తీక మాసం పండుగల ప్రభావంతో రూప్‌చంద్ ధర తగ్గడానికి కారణమని ట్రేడర్స్ చెబుతున్నారు. మరో రెండు మూడు నెలలు ఇదే పరిస్థితి ఉండవచ్చని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.
- ఓ వైపు పెరుగుతున్న చేపల సరుకు టన్నేజి పెరగడంతో మార్కెట్‌పై విపరీతమైన ఒత్తిడి పడుతోంది. మార్కెట్‌కు వస్తున్న సరుకు ఎక్కువగా ఉండడం వల్ల ధర తగ్గుతుంది.
- ఆక్వా రంగం అత్యున్నత స్థాయిలో ఉన్నప్పుడు మేతలు, మందులకు జీఎస్టీ పేరుతో కోట్లలో రాబడి సంపాదించినా ప్రభుత్వం ప్రస్తుతం నష్టాల్లో ఉన్న రైతును ఆదుకోవడానికి ముందుకు రాకపోవడం శోచనీయం .

అన్నదాతల్లో ఆందోళన

చాట్రాయి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికలకు తోడు బుధవారం వర్షం కూడా రావడంతో అన్నదాతలకు కంటి మీద కునుకు కరువైంది. మండలంలో సుమారు 12 వేల ఎకరాల్లో వరి సాగు జరగ్గా ఎక్కువ శాతం పంట కోత దశకు వచ్చింది. చాట్రాయి, బూరుగుగూడెం, ఆరుగొలనుపేట గ్రామాల్లో వరి కోతలు మొదలయ్యాయి. ఈ పరిస్థితుల్లో భారీ వర్షాలు కురిస్తే పంట నాశనమయ్యే ప్రమాదం ఉన్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాను గండం నుంచి తమను కాపాడాలని దేవుళ్ళకు మొక్కుతున్నారు.

పాఠశాలల తనిఖీ

ముదినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెనుమల్లి శివారు సింగారం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో-2 కె.నరేష్ కుమార్ సందర్శించి తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేయటంతో పాటు విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రతీ తరగతిలోను చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిలో సామర్థ్యాన్ని పెంచేందుకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో మెనూ తప్పని సరిగా పాటించాలన్నారు. పాఠశాల ఆవరణను గ్రీనరీగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం జి.సింహాచలం పాల్గొన్నారు.

ముసునూరు: విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. బుధవారం సూరేపల్లి గొల్లగూడెంలోని ఎంపీపీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం రికార్డులతో పాటు స్మార్ట్ టీవీని ఉపయోగించి తరగతులు నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించి సమాధా నాలు రాబట్టారు.

శివరామకృష్ణకు గౌడ సంఘం నాయకుల అభినందన



చాట్రాయి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ జన్మదిన వేడుకలు బుధవారం నూజివీడులో జరిగాయి. చాట్రాయి మండల గౌడ సంఘం నాయకులు తల్లాడ శ్రీనివాసరావు, చింతగుంట్ల వెంకటేశ్వరరావు, మిద్దె శివాజీ, పవన్‌కుమార్ తదితరులు శివరామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినికి స్టెతస్కోప్ బహూకరణ

ఆగిరిపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో ర్యాంక్ సాధించి, విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో సీటు సాధించిన జి. హర్షితకు ఎం. సూరవరం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయ బృందం బుధవారం స్టెతస్కోప్‌ను బహూకరించింది. ఈ పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న జ్యోతి కుమార్తె హర్షిత. హెచ్‌ఎం మాట్లాడుతూ వైద్యురాలిగా పేద ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.

కార్తీక నిత్య అన్నదానం ప్రారంభం

ముదినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం షిర్డిసాయిబాబా మందిరంలో కార్తీక మాసం సందర్భంగా బుధవారం అయ్యప్ప, భవానీ మాలధారులకు నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభమయింది. కొరగుంటపాలెంకు చెందిన అచ్యుత నరేంద్ర దంపతులు నవంబరు 21 వరకు నిత్యాన్న కార్యక్రమానికి దాతగా వ్యవహరిస్తారు. మందిరంలో సాయిబాబాకు అభిషేకాలు, పూజలు జరిపి అనంతరం జరిగిన ఈ అన్నదానంలో 300 మంది స్వాములు పాల్గొన్నారు. మందిర చైర్మన్ పరసా ఏడుకొండలు, వైస్ చైర్మన్ నీలం నరసింహారావు, కార్యదర్శి మరిపి శివ, గురుస్వామి జొన్నవిత్తుల రాము స్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కలిదిండి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. కట్టావానిపాలెంకు చెందిన జంపాని నారాయణరావు (58) ఈ నెల 20న మోటారు సైకిల్‌పై కలిదిండి వస్తుండగా, సానారుద్రవరానికి చెందిన బోయిన నాగేంద్ర (28) పడమటిపాలెం సమీపంలో మోటారు సైకిల్‌తో వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. నారాయణరావు తలకు తీవ్ర గాయమవ్వటంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. తలకు తీవ్ర గాయమైన నాగేంద్ర విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలు

నూజివీడు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి ఆరునెలలు జైలుశిక్ష విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పుచెప్పారు. నూజివీడు మండలం పల్లెర్లమూడికి చెందిన యనమదల గాంధీ, 2018 జనవరి 1న రూ.4 లక్షలను హనుమాన్ జంక్షన్‌కు చెందిన వల్లూరిపల్లి దుర్గాభవానికి అప్పు ఇచ్చారు. బాకీ తీర్చాలని దుర్గాభవానిని కోరగా రూ.5,45,000 చెక్కును దుర్గాభవాని గాంధీకి ఇచ్చింది. అయితే ఖాతాలో నగదు లేదని, చెక్కు తిరిగి రావడంతో గాంధీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసు విచారించిన న్యాయమూర్తి దుర్గా భవానీకి ఆరునెలలు జైలుశిక్ష, రూ.7లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ముదినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో సంభవించిన అగ్ని ప్రమాదంలో హోటల్‌లో పని చేస్తున్న మడ్డి నరసమ్మకు చెందిన ఇల్లు అగ్నికి ఆహుతి కాగా, సుమారు రూ.3 లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లింది. కైకలూరు నుంచి అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. నిరాశ్రయురాలైన నరసమ్మ కుటుంబానికి, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆమె తరఫున ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ సహాయాన్ని అందజేశారు.